Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 21.12.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 29 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## కలుపుకు పోవడమే...
# కేసీఆర్ వ్యూహం



- ఫెడరల్ ఫ్రంట్‌కు పదునుపెడుతున్న టీ సీఎం
- వైసిపి గెలుపే చంద్రబాబుకిచ్చే రిటర్న్‌గిఫ్ట్
- జగన్‌ను కలుపుకుని కేంద్రంలో కీలకం కావాలని ప్రణాళిక

**కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీని ఓడించడమే లక్ష్యమంటూ ఏపి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు బీజేపీయేతర పార్టీలను ఒకే వేదికపైకి తేవాలని చూస్తున్నాడు. ఈ ప్రయత్నంలో ఆయన విలువలను సైతం వదిలేస్తున్నాడు. తెలుగుదేశం పార్టీ పునాది సిద్ధాంతాలకు పాతరేస్తున్నాడు.**

కాంగ్రెస్‌తో చేతులు కలిపాడు. మమతాబెనర్జీని ప్రసన్నం చేసుకున్నాడు. ములాయంసింగ్‌కు మోకరిల్లాడు, స్టాలిన్‌కు భజన చేసాడు, దేవేగౌడ, కుమారస్వామిలను కౌగిలించుకున్నాడు, శరద్‌పవార్ శరణుకోరాడు, ఫరూక్ అబ్దుల్లాతో ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టించుకున్నాడు, మాయావతిని మచ్చిక చేసుకున్నాడు... అయితే చంద్రబాబు ఇంత చేసాడు. కాని రేపు వీళ్ళంతా ఇలానే కలిసుంటారా... నిజంగా బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు సొంతంగా కనీసం 200కు పైగానే సీట్లు రావాలి. కాంగ్రెస్ కంటే దాని భాగస్వామ్య పక్షాలకు ఎక్కువ సీట్లు వచ్చాయనుకోండి... మమతాబెనర్జీ, మాయావతి, ములాయంసింగ్, శరద్ పవార్... వీళ్ళంతా ప్రధాని రేసులోకి వచ్చేవాళ్ళే! వీళ్ళ మధ్య ఇక చంద్రబాబు వూరుకుంటాడా? 40ఏళ్ళ ఇండస్ట్రీ అయిన తనకూ ప్రధాని పదవి కావాలంటాడు.

అయితే చంద్రబాబు మహాకూటమికి ప్రత్యామ్నాయంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంతకుముందే ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేశాడు. కాని, జాతీయ రాజకీయాలలో మిగతా పార్టీల నాయకులతో చంద్రబాబుకు వున్నంతగా సంబంధాలు కేసీఆర్‌కు వుండవు. కాబట్టే మిగతా పార్టీల నుండి ఆయనకు అంతగా సహకారం అందలేదు. జాతీయ స్థాయి రాజకీయాలలో చక్రం తిప్పాలని చంద్రబాబు మహాకూటమి కడితే, కేసీఆర్ మాత్రం జాతీయ రాజకీయాలలో తెలుగు రాష్ట్రాలకు మునుపటి ప్రాధాన్యత ఉండేలా, దానికి తానే సారధ్యం వహించేలా చూస్తున్నాడు. ఇందుకోసం ఇంట గెలిచి రచ్చ గెలవాలనే సూత్రాన్ని అమలుచేస్తున్నాడు. ఏపిలో 25లోక్‌సభ, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలున్నాయి. నిన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ ఘన విజయం సాధించింది. రేపు లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఫలితాలు అదేవిధంగా వుండొచ్చు. ఇక టిఆర్ఎస్‌తో ఎంఐఎం కలిసే వుంది. తెలుగు రాష్ట్రాలలో మరో

(మిగతా 11వ పేజీలో)







# పొత్తుతోనే చిత్తు!



- అక్కడ కాంగ్రెస్‌కు నష్టం
- ఇక్కడ టిడిపికి కష్టం
- అవకాశవాద స్నేహానికి గుణపాఠం

**చరిత్రను రాజకీయ నాయకులు తొందరగా మర్చిపోవచ్చు, లేదా అవకాశవాదం కోసం మర్చిపోయినట్లు కూడా నటించవచ్చు. ప్రజలకు అంతగా మరిచిపోవాల్సిన అవసరముండదు. తాము ఏమి రాజకీయం చేసినా చెల్లుతుందని చెప్పి పిచ్చి పిచ్చి వేషాలేస్తే ప్రజలు ఆ పిచ్చి దిగిపోయేలా బుద్ధిచెబుతారు.**

తెలంగాణ ఎన్నికల్లో జరిగింది ఇదే! సిగ్గు లేకుండా కాంగ్రెస్, టిడిపిలు పొత్తు పెట్టుకున్నా, మీకు లేకపోయినా మాకు ఆత్మాభిమానం వుందని చాటుకున్నారు తెలంగాణ ప్రజలు. అవకాశవాద పొత్తును చిత్తుగా ఓడించారు. ఫలితాలు వచ్చిన తర్వాత తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తేరుకున్నారు. ఫలితాలపై పోస్ట్‌మార్టమ్ చేసుకున్నారు. తెలుగుదేశంతో పొత్తే తమ కొంప ముంచిందని తేల్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశంతో కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదంటున్నారు. తెలుగుదేశంతో పొత్తు లేకుండా పోటీ చేసున్నా ఇంకో 20సీట్లన్నా వచ్చి వుండేవని, గౌరవ ప్రదంగానన్నా వుండేదని బాధపడుతున్నారు.

టిడిపితో పొత్తు కాంగ్రెస్‌కు తెలంగాణలో కలిసిరాలేదు. అటువంటి పరిస్థితే ఆంధ్రాలో కూడా వుంది. కాకపోతే ఇక్కడ రివర్స్. కాంగ్రెస్‌తో పొత్తు ఇక్కడ తెలుగుదేశంకు నష్టం కలిగించే అవకాశాలున్నాయి. ఏపి ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఇంకా పోలేదు. 2014 రాష్ట్ర విభజన సంఘటనలు పదేపదే కళ్ళ ముందు మెదులుతున్నాయి. సోనియా, రాహుల్‌లతో సహా అప్పుడు కాంగ్రెస్ నాయకుల తల బిరుసుతనం ప్రతిఒక్క ఆంధ్రుడి మనసును

(మిగతా 11వ పేజీలో)



# ఉత్తర ద్వార దర్శనం.. పులకించిన భక్తజనం

నెల్లూరు జిల్లాలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈనెల 18న తెల్ల వారు జామునుంచే భక్తులు దేవాలయాలకు వెళ్ళి విశేష పూజలు చేసారు. ఉత్తరద్వారం గుండా దేవదేవుని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆ దివ్య క్షణం అనిర్వ చనీయమైన అనుభూతులతో భక్తజనం పులకించిపోయారు. దేవాలయాలన్నీ భక్తు లతో కిటకిటలాడాయి. నెల్లూరులోని పినాకినీ నదీ తీరాన వెలసిన శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కావలి, నాయుడు పేట, సూళ్ళూరుపేట, వెంకటగిరి, ఆత్మ కూరు, ఉదయగిరి, కోవూరు, నెల్లూరు రూరల్ లోని నరశింహకొండ, పెంచలకోన తదితర వైష్ణవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేసారు.



- గోవిందనామ స్మరణలతో మార్మోగిన వైష్ణవాలయాలు
- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

**వేణుగోపాలస్వామి దేవస్థానంలో..**

నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణు గోపాలస్వామి దేవస్థానంలో భక్తులు వైకుంఠ ద్వారంలో స్వామిని దర్శించుకు న్నారు. గరుడవాహనంపై విశేషాలంకా రంలో వేణుగోపాలుడ్ని కొలువు తీర్చారు.

**మాగుంట లేఅవుట్లో..**

మాగుంట లేఅవుట్లోని శ్రీ వేంక టేశ్వరస్వామి దేవస్థానంలో విశేష అలం కారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

**దర్గామిట్టలో..**

దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాములకు విశేష పూజలు నిర్వ హించారు. గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

**ఫత్తేఖాన్ పేటలో..**

ఫత్తేఖాన్ పేట అరిగెలవారివీధిలోని మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరిం చుకుని రైతుబజార్ సెంటర్లోని రాజా గణపతి దేవస్థానం నుంచి మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వరకు మహాలక్ష్మీ బాలసంఘం ఆధ్వర్యంలో 108 కలశా లతో మహిళా భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి అభిషేకాలు నిర్వహించారు.

**నరశింహకొండలో..**

నరశింహకొండలో కొలువైన వేదగిరి లక్ష్మీనరశింహస్వామి ఆలయంలో స్వామి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

**పెంచలకోనలో..**

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో ముక్కోటి ఏకాదశి పర్వ దినం సంచదర్భంగా పెనుశిల నరశింహ స్వామి ఉత్తరద్వారంలో భక్తులకు దర్శన మిచ్చారు. పెనుశిల నరశింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ఏడు ఉత్తర ద్వారాలను ఏర్పాటుచేసి అందులో బంగారు గరుడవాహనాన్ని ఉంచి పెనుశిల లక్ష్మి నరశింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుతీర్చారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై స్వామివారిని ఉంచి క్షేత్రోత్సవం జరిపారు.

ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, మాజీ ఎంపి, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయాల కార్యనిర్వాహణాధికారులు భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసారు.

## 'గీతాంజలి'లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

కోవూరు మండలంలోని గంగవరం వద్ద ఉన్న 'గీతాంజలి' ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 22, 23 తేదీల్లో ఉభయ తెలుగురాష్ట్రాల ఓపెన్ చెస్ పోటీ లను నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులకు 1.2 లక్షల ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు, జ్ఞాపికలను అందజేయనున్నామని జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులకు గీతాంజలి కళాశాలవారి సౌజన్యంతో ఉచిత భోజనం, వసతి సదుపాయాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9154321166 ఫోన్ నంబరును సంప్ర దించాలని ఆయన కోరారు.

## జంగాలకండ్రిక రోడ్డుకు 5కోట్లు

టి.పి.గూడూరు మండలం వరిగొండ నుండి ముత్తుకూరు మండలంలోని జంగాలకండ్రిక వరకు 5.48 కిలోమీటర్ల లింకురోడ్డు నిర్మాణానికి 5కోట్ల రూపా యలను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి.

### పాత్రికేయులకూ...

## రాజన్న కంటి వెలుగు



నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ తన నియోజకవర్గ ప్రజలను దృష్టిలో పెట్టుకుని వారి దృష్టి బాగుండాలని చెప్పి 'రాజన్న కంటి వెలుగు' కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం తెలిసిందే! నెల్లూరులో వుండే జర్నలిస్టుల కంటి చూపు కూడా బాగుండాలని, వారి కళ్ళు కూడా తనను చల్లంగా చూడాలని కోరుకున్నాడో ఏమో, వారి కోసం కూడా 19వ తేదీ నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో రాజన్న కంటివెలుగు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 115మంది జర్నలిస్టులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ మాదరన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో కంటి వైద్య శిబిరాలను పూర్తి చేసామన్నారు. ఇంతవరకు 11వేల మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 3వేల మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, 250మందికి కంటి ఆపరేషన్లు చేయించామని వెల్లడించారు. జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడితో తమ ఆరోగ్యాన్ని చూసుకోలేరని, వారి ఆరోగ్యం బాగుంటే సమాజం ఆరోగ్యంగా వుంటుందనే ఉద్దేశ్యంతో ఈరోజు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జర్నలిస్టుల కోసం త్వరలో రాజన్న గుండె భరోసా ద్వారా గుండె వ్యాధుల వైద్యశిబిరాన్ని కూడా ఏర్పాటు చేయిస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, సర్వేపల్లి రామ్మూర్తి, కార్పొరేటర్ ఎం.డి ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణలు జాస్తి...

# అభివృద్ధి నాస్తి!

**- సోమిరెడ్డిపై సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫైర్**

సోమిరెడ్డిలా అవినీతికి పాల్పడడం తమకు చేతకాదని, 70 ఏళ్ళ సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన తమ కుటుంబం ఏనాడూ అవినీతికి పాల్పడలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే, వైయస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 17న పొదలకూరు రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ లో పాల్గొన్న ఎమ్మెల్యే విలేఖర్లతో మాట్లాడుతూ మంత్రి హోదాలో సోమిరెడ్డి అవినీతికి పరాకాష్టగా ఆయన వ్యక్తిగత సహాయకుడు(పిఏ) రాపూరు మండలం పంగిలిలో అటవీభూములను ఆక్రమించు



ప్రజావిజ్ఞప్తుల దినంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కుని అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడని, రూ 3 కోట్ల విలువైన పొదలకూరు పంచాయితి ఆధీనంలో వున్న గ్రామ కంఠం స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించాడని ఆరోపించారు. పంచాయితీ సెక్రటరీ జారీచేసే అనుభవ సర్టిఫికెట్‌ను ఫోర్జరీ చేసి సుమారు 300 అంకణాల స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. పొదలకూరు గ్రామకంఠం స్థలాన్ని కాజేసేందుకు వ్యూహం పన్నిన ఏ ఒక్కరినీ విడిచి పెట్టేది లేదన్నారు. ఎంపిపి కోనం చినబ్రహ్మయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, సర్వేపల్లి మహిళా విభాగం ఇన్ చార్జి తెనాలి నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులూ.. అధైర్యపడొద్దు

**---------------------- పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి**



అగ్రిగోల్డ్ బాధితులు ఎవ్వరు అధైర్యపడొద్దని అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ తిరుపతి పార్లమెంట్ కన్వీనర్ పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి సూచించారు. ఈనెల 17 న నెల్లూరు జిల్లా విద్యానగర్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు మన రాష్ట్రంలో 19.50 లక్షల మంది ఉన్నట్లు తెలిపారు. అగ్రిగోల్డ్ పేరిట 18,600 ఎకరాల భూములు ఉన్నాయని, అమరావతి సమీపంలో రూ. 20 వేల కోట్ల విలువజేసే విలువైన స్థలాలు ఉన్నాయన్నారు. అయినా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 265 మందికి పైగా మరణించారని, ఒత్తిళ్ళు తట్టుకోలేక అగ్రిగోల్డ్ ఏజంట్లు బలవన్మరణాలకు పాల్పడ్డా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు అండగా రూ.10 లక్షలు ఇవ్వాలని తమ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన పోరాటానికి ఉద్యమ కార్యాచరణను ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22,23 తేదీల్లో మండల కేంద్రాల్లో, 30న జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహారదీక్షలు చేయనున్నట్లు తెలిపారు. సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, చిల్లకూరు వెంకటరెడ్డి, పొదర్తి రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, చేవూరు నాగయ్య, గూడూరు రమేష్ రెడ్డి, వంజివాక ఎంపిటీసీ సభ్యుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 24 నుండి డీఎస్సీ పరీక్ష

స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితుల పోస్టులకు డీఎస్సీ పరీక్షను ఈనెల 24 నుండి 28 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 6241 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఆన్‌లైన్లో నిర్వహించనున్న పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6గంటల వరకు జరగనుంది. డీఎస్సీ తొలివిడతలో మొత్తం 142 పోస్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో డీఎస్సీ పరీక్షను ఆరు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఆన్ లైన్లో నిర్వహించనున్నందున కంప్యూటర్లు ఎక్కువగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలను ఎంపిక చేశారు. ఆదిశంకర, వెంకటేశ్వర, నారాయణ, పీబీఆర్ విశ్వోదయ, రామిరెడ్డి సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలను నిర్వహించనున్నారు

## జననేతతో జనార్ధన్‌రెడ్డి తనయుడు



ఈ నెల 19వ తేదీన శ్రీకాకుళం జిల్లా కొబ్బరిచెట్లపేట ప్రాంతంలో ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహిస్తున్న వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని తిరుపతి, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గాల వైసిపి ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలిసారు. రెండు పార్లమెంటు నియోజక వర్గాలలో పార్టీ పటిష్టత కోసం చేపట్టాల్సిన అంశాలపై ఆయన జగన్‌తో చర్చించారు.

# నమ్మకం నిలబెట్టింది

అంతరిక్ష ప్రయోగాలలో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరో అనితర విజయాన్ని తన ఖాతాలో జమ చేసుకుంది. పిఎస్ఎల్‌వి సిరీస్‌లోనే కాదు, జిఎస్ఎల్‌వి సిరీస్‌లోనూ సక్సెస్ కాగలమని చాటి చెప్పింది. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4.10 నిముషాలకు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన జిఎస్ఎల్‌వి-ఎఫ్11 విజయవంతమైంది. ఈ రాకెట్ ప్రయోగం ద్వారా 2250 కిలోల బరువుగల జీశాట్-7ఏ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇది 8ఏళ్ళ పాటు తన సేవలు అందిస్తుంది. కమ్యూనికేషన్ రంగంలో మరింత మెరుగైన సేవలకు ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. వైమానిక, రక్షణ శాఖలకు ఈ ఉపగ్రహం సేవలందిస్తుంది.


మొత్తం మూడు దశలలో ఈ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. 19నిముషాల 20 సెకన్లలో నిర్ణీత కక్ష్యలో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. మూడో దశలో కీలకమైన క్రయోజనిక్ దశ శాస్త్రవేత్తలు నిర్దేశించిన విధంగా పూర్తయ్యింది. ప్రయోగం విజయవంతం కాగానే శాస్త్రవేత్తలు ఒకర్నొకరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు. ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ కె.శివన్ ప్రయోగాన్ని పర్యవేక్షించారు. పిఎస్ఎల్‌వి-సి43ని ప్రయోగించి 20 రోజులు గడవక ముందే మరో కీలక మైన రాకెట్ ప్రయోగం జరిపి విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తల బృందాన్ని పామరుడి నుండి ప్రధాని వరకు అందరూ అభినందనలతో ముంచెత్తారు.

## జిఎస్ఎల్‌వి-ఎఫ్11 విజయవంతం



ఇస్రో ఛైర్మెన్ శివన్ విజయసంకేతం

### పూర్తి విశ్వాసం...



ఈ ప్రయోగం విజయవంతంతో జిఎస్ఎల్‌వి సిరీస్‌పై ఇస్రోకు పూర్తిస్థాయి నమ్మకం ఏర్పడింది. 2001 ఏప్రిల్ 18న జిఎస్ఎల్‌వి-డి1 పేరుతో ఇస్రో భారీప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. 2010 ఏప్రిల్ 15న పూర్తిస్థాయి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన క్రయోజెనిక్ ఇంజన్‌తో జిఎస్ఎల్‌వి-డి3ని ప్రయోగించగా, అది విఫలమైంది. అయితే, మన శాస్త్రవేత్తలు మళ్ళీ పట్టుదలతో అదే యేడాది డిసెంబర్ 25న రష్యా సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో తయారుచేసిన ఇంజన్‌తో చేసిన ప్రయోగం కూడా విఫలం అయ్యింది. 2001 నుండి 2010 మధ్య జిఎస్ఎల్‌వి సిరీస్‌లో 7ప్రయోగాలు జరగ్గా 3 విఫలమయ్యాయి. 2014 నుండి ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన క్రయోజెనిక్ ఇంజన్‌ను జిఎస్ఎల్‌వి ప్రయోగాలకు వాడసాగింది. 2014 జనవరి 5వ తేదీ నుండి ఇప్పటివరకు వరుసగా సొంత క్రయోజెనిక్ ఇంజన్లతో 7 ప్రయోగాలు నిర్వహించగా, అన్నీ విజయవంతం అయ్యాయి. రాబోయే కాలంలో అత్యంత బరువైన ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపడమే కాకుండా మానవ సహిత అంతరిక్ష యాత్రలకు చంద్రయాన్-2 లాంటి భారీ ప్రయోగాలకు ఈ ప్రయోగం పునాది కానుంది. అంతరిక్ష పరిజ్ఞానంలోనే కాదు, అంతర్జాతీయంగా, అంతరిక్ష వాణిజ్యంలో కూడా భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ఈ ప్రయోగం ఎంతో దోహదపడనుంది.

## గుంటూరు నుండి గూడూరుకు!



గూడూరు డిఎస్పీగా సౌమ్యలతను నియమిస్తూ డిజిపి ఆర్పీ ఠాకూర్ ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు అర్బన్ వెస్ట్ డిఎస్పీగా వున్న ఆమెను ఇక్కడకు బదిలీ చేశారు. గూడూరు డిఎస్పీగా వున్న వి.ఎస్.రాంబాబును గుంటూరులోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. విశాఖపట్నంకు చెందిన సౌమ్యలత 2012 బ్యాచ్ అధికారి. గతంలో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో, విజయనగరం జిల్లా బొబ్బిలిలో డిఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరులో పనిచేస్తూ గూడూరుకు బదిలీ అయ్యారు.

# ఇదేం పద్ధతి?..ఇలాగేనా పనిచేసేది?

## - అధికారుల తీరుపై మండిపడ్డ కలెక్టర్

ఇదేం పద్ధతి.. ఇలాగేనా పనిచేసేది?.. ఎన్నిసార్లు చెప్పినా ఇంతేనా?.. అంటూ జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలుచేయని అధికారులు, సిబ్బంది తీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పథకాల అమలులో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

ఈనెల 19న కలెక్టర్ బంగ్లాలో కోవూరు నియోజకవర్గ ఎంపిడిఓలు, బ్యాంకర్లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. వినూత్నమైన రీతిలో వారిని బృందాలుగా కూర్చోబెట్టి మండలాలు, బ్యాంకు శాఖల వారీగా సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ పథకాల అమలులో ఇంకా కొన్నింటిని పెండింగ్‌లో ఉంచడం సరైన పద్ధతి కాదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిట్లు మంజూరైనా ఇంకా ఎందుకు గ్రౌండింగ్ కాలేదని అధికారులను ప్రశ్నించారు. ష్యూరిటీ లేకుండా గ్రౌండింగ్ కావడంలేదని పల్లిపాడు పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో, గ్రౌండింగ్‌కు ష్యూరిటీ అవసరం లేదని ఆమాత్రం మీకు తెలియదా అంటూ కలెక్టర్ గట్టిగా ప్రశ్నించారు. వచ్చేవారంలోగా సరైన పురోగతి లేకపోతే సస్పెన్షన్‌కు సిద్ధంగా ఉండాలని ఆ కార్యదర్శిని హెచ్చరించారు. బిసి కార్పొరేషన్ ఇ.డి వెంకటస్వామి, ఎస్సీ కార్పొరేషన్ ఇ.డి శ్రీనునాయక్, పశుసంవర్ధకశాఖ జె.డి విజయమోహన్, ఏపిజిబి ఆర్ఎం రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.






### • ఆమంచర్ల శంకరనారాయణ

# ఉద్యమాలతో... అలసి సొలసి ఆగిన ఊపిరి

నెల్లూరులోని చారిత్రాత్మక వి.ఆర్ విద్యాసంస్థల గత పాలకవర్గంపై దాదాపు 34ఏళ్ళు పోరాటం చేసి విజయం సాధించి ఆ విద్యాసంస్థల పాలకవర్గ ఎన్నికలకు బాటలు వేసిన ఉద్యమసారధి, బీజేపీ నాయకులు, ప్రముఖ ఆడిటర్ ఆమంచర్ల శంకరనారాయణ ఈ నెల 14వ తేదీన గుండెపోటుతో ఆకస్మికంగా స్వర్గస్తులైనారు. ఆయన వయసు 64సంవత్సరాలు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. 1955 జూన్ 2వ తేదీన జన్మించిన ఆయన విద్యార్థి దశ నుండే ఉద్యమాలలో చురుకుగా వుండేవారు. ప్రస్తుత భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడుకి అప్పట్లో శిష్యుడిగా వుంటూ ఆయనతో కలిసి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. 1974లో విఆర్ కళాశాల అధ్యక్షుడిగా ఏబివిపి తరపున పోటీ చేశారు. 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. తర్వాత కాలంలో బీజేపీలో చేరి పార్టీలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. 1994లో నెల్లూరు శాసనసభ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పొందారు. కొన్నేళ్ళ క్రితం తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం నుండి కూడా బీజేపీ మద్దతుదారుగా పోటీ చేసి మరో ఓటమే చవిచూశారు.

ముఖ్యంగా విఆర్ విద్యాసంస్థల పాలకవర్గం విషయంలో ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం. ఆ అంశంలో జిల్లా కోర్టు నుండి సుప్రీంకోర్టు దాకా పోరాడాడు. ఎక్కడా వెనక్కు తగ్గలేదు. దీనికోసం సొంత నిధులనే ఖర్చు చేసుకున్నాడు. విఆర్ పాలకమండలికి ఎన్నికలు తెచ్చాడు. అయితే ఈ ఓటింగ్ నమోదు విషయంలో ఆయన ఇటీవల తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. విఆర్ విద్యాసంస్థల ఓటింగ్ నమోదులో నాలుగు ప్యానెళ్లు పోటీ పడ్డాయి. అయితే మిగతా పదవుల విషయం ఎలా వున్నా ఇన్నేళ్ళు పోరాడిన ఆమంచర్ల శంకర నారాయణను కరస్పాండెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలనే విషయంలో మిగతా ప్యానెల్ వాళ్ళు కూడా అంగీకారానికి వచ్చారు. తన పోరాట ఫలాలను అనుభవించకుండానే ఆయన ఈ లోకాన్ని విడిచివెళ్లారు. ఎప్పుడూ ఓటమినే చవిచూసే శంకర నారాయణకు వి.ఆర్. కాలేజీ వ్యవహారంలో విజయం చేకూరింది. ఆ విజయానంద ఫలాలను ఆస్వాదించే తరుణంలో మళ్ళీ మృత్యువు ఆయనని ఓడించింది. ఆమంచర్ల శంకర నారాయణ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



నా బాల్య మిత్రుడు, చిత్తశుద్ధి, పట్టుదల కలిగిన సామాజిక సేవకులు అయిన శ్రీ ఆమంచర్ల శంకర నారాయణ గారు ఈ రోజు తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందడం విచారకరం. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

(ముప్పవరపు వెంకయ్య నాయుడు)

న్యూఢిల్లీ

14 డిసెంబర్ 2018

వెంకయ్యనాయుడి సంతాపం




దీపావెంకట్ అక్షర నివాళి

## ఉపరాష్ట్రపతి వెంకయ్య సంతాపం

ఆమంచర్ల శంకరనారాయణ మృతి పట్ల ఒకప్పటి ఆయన గురువు, ఆత్మీయుడు, భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక ఆప్తమిత్రుడిని, ఒక సామాజిక సేవకుడిని కోల్పోయానని ఆయన తన విచారం వ్యక్తం చేశారు. అలాగే స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ కూడా ఒక ప్రకటనలో శంకరనారాయణ మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## 'ప్రభా'తం

# ఎవరి దేశభక్తి ఎంత?

గత మూడు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాలలో తరచుగా వినిపిస్తున్న పదం 'దేశభక్తి'. దేశ రాజకీయాలలో భారతీయ జనతాపార్టీ ఎదుగుదల మొదలైనప్పటి నుండీ ఈ పదానికి ప్రాధాన్యత పెరిగింది. ఈ అంశానికి ప్రాధాన్యత పెరిగేకొద్దీ కాంగ్రెస్ బలహీనపడుతూ వచ్చింది. దీనిని బట్టి అర్థమయ్యేదేంటంటే కాంగ్రెస్‌కు దేశభక్తి తక్కువని!? బీజేపీ దేశభక్తి అంశానికి ఎక్కువుగా ప్రాచుర్యం కల్పిస్తోందని!

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత రాజకీయాలలో కాంగ్రెస్ గెలిచింది, ఓడింది. కాని ప్రజలెప్పుడూ కాంగ్రెస్‌ను విలన్‌గా చూడలేదు సరికదా, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి నేతృత్వం వహించిన పార్టీగా కాంగ్రెస్‌ను చూశారు. ఆ బ్రాండ్ ఇమేజ్ వల్లే దాదాపు 60ఏళ్ల పాటు ఆ పార్టీ దేశాన్ని ఏలగలిగింది.

కొద్దికాలంగా దేశ ప్రజలలో ఆ పార్టీ ఇమేజ్ మసకబారుతూ వస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. ఇంతకాలం కాంగ్రెస్ నాయకత్వం ముసుగేసి కప్పిపెట్టిన చరిత్రను బీజేపీ నాయకులు ముసుగుతీసి ప్రజలకు చూపిస్తుండడమే! స్వాతంత్ర్య పోరాట సమయంలో సుభాష్‌చంద్రబోస్‌ను యుద్ధఖైదీగా అప్పగిస్తామంటూ గాంధీ, నెహ్రూలు బ్రిటీష్ వారితో చేసుకున్న ఒప్పందం, మత ప్రాతిపదిక విభజనకు గాంధీ అంగీకరించడం, తొలిప్రధానిగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను కాదని నెహ్రూను చేయడం, చైనా యుద్ధంలో నెహ్రూ చేతకానితనం వల్ల మానస సరోవర్ ప్రాంతాన్ని కోల్పోవడం, భారత్‌లో సంపూర్ణంగా విలీనం కావాల్సిన జమ్మూ కాశ్మీర్‌ను రావణకాష్టం చేసి పెట్టడం... తన స్వార్థం కోసం నెహ్రూ ఇలా ఎన్నో చారిత్రక సత్యాలను మరుగున పడేసారు. దేశాన్ని కాంగ్రెస్ పరిపాలించినంత కాలం ఈ అంశాలు వెలుగులోకి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూపొందించిన చరిత్ర పాఠాలనే చదువుకున్నాం... దురాక్రమణదారులను హీరోలుగా చిత్రించి వారిని ఆదర్శపురుషులుగా చూపితే, నిజమేననుకున్నాం...

కానీ ఈ దేశ రాజకీయాలలో బీజేపీ వేళ్లూనుకునే కొద్దీ... పాతిపెట్టిన చారిత్రక అంశాలు ఒక్కొక్కటిగా బయటకు రాసాగాయి. స్వాతంత్ర్య సంగ్రామాన్ని గాంధీ, నెహ్రూలకే పరిమితం చేసి వుండగా, ఇప్పుడు సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్ వంటి త్యాగధనులను గుర్తుంచుకునేలా, వారి త్యాగాలకు గుర్తింపు లభించేలా బీజేపీ బాటలు వేసింది. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్సే అని నమ్మేవాళ్లు క్రమక్రమంగా తగ్గుతుండటంతో ఆ పార్టీ దేశ వ్యాప్తంగా క్రమక్రమంగా తగ్గుతూ వచ్చింది. ఓట్ల బ్యాంకుల కోసం దేశ భద్రతను సైతం పణంగా పెట్టడంలో కాంగ్రెస్ ఏరోజూ వెనుకాడలేదు. దేశ భద్రతను రాజకీయం చేయడానికి సైతం ఆ పార్టీ సంకోచించడం లేదు. ఆ పార్టీలో ఇప్పటికీ భారత్ కంటే పాకిస్థాన్‌ను ప్రేమించేవాళ్ళున్నారనే విషయం అప్పుడప్పుడూ ఆ పార్టీ నాయకుల స్టేట్‌మెంట్ల ద్వారానే అర్థమవుతుంది.

దేశ భద్రతాంశాలను వీధుల్లో పెట్టి రాజకీయం చేయడం, దానిద్వారా ఓట్ల లబ్ది పొందాలనుకోవడం కాంగ్రెస్ సహజ లక్షణం. 'రాఫెల్' రాద్ధాంతం కూడా ఇలాంటిదే! భారత్ - ఫ్రాన్స్‌ల మధ్య కుదిరిన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పెద్ద రాద్ధాంతమే చేశాడు. ఇక్కడ లక్షకోట్ల అవినీతే జరిగిందనుకుందాం... మరి ఆ డబ్బు తినేది ఎవరు? మొదటి వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ... నీతి నిజాయితీల విషయంలో ఆయన ముందు రాహుల్ దిగదుడుపే! మరి రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తిన్నారా...? దేశం కోసం తప్పితే దేహం కోసం పనిచేసే నాయకురాలు కాదు. రక్షణ కొనుగోళ్లలోనూ కమిషన్ల వ్యాపారం చేసే అలవాటు కాంగ్రెస్ నాయకులకే వుందన్న సత్యం గతంలో ఎన్నో సంఘటనలలో ఋజువైంది. ఇప్పుడు అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణం కాంగ్రెస్ అధినేతల చుట్టూ చక్కర్లు కొడుతుండడం చూస్తూనేవున్నాం.

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం భారత్-ఫ్రాన్స్‌ల మధ్య కుదిరిన రహస్య ఒప్పందమని, దీనిని బయట పెట్టడం కుదరదని కేంద్రం గతంలో ప్రకటించడం తెలిసిందే! రహస్య ఒప్పందం అంటే అందులో ఏదో మతలబు వుందని, వేలకోట్ల అవినీతి దాగుందని కాంగ్రెస్ అనుమానించింది. వాళ్ళకు అలాంటివి అలవాటు కాబట్టి అనుమానాలు రావడం సహజమే! కాని, ఇక్కడ ఫ్రాన్స్‌తో రహస్య ఒప్పందం అన్నది ఒక బిజినెస్ టెక్నిక్! దీనిని చిన్న ఉదాహరణతో పోల్చి చూద్దాం. వెంకటరావు అనే వ్యక్తి హైదరాబాద్ సిటీలో ఒక లే అవుట్ వేశాడు. చదరపు గజం ధర 10వేలుగా నిర్ణయించి అందరికీ అమ్ముతున్నాడు. అతని మిత్రుడు సుబ్బారావు వచ్చి తనకీ ఒక స్థలం కావాలని అడిగాడు. వెంకట్రావు స్నేహ ధర్మంతో అతనికి తనకు పడ్డరేటు అంటే చదరపు అడుగు 7వేలకే ఇచ్చాడు. అయితే ఆ రేటును బయట మార్కెట్‌లో చెప్పొద్దని, అలా చెబితే మిగతావాళ్ళు కూడా అదే రేటుకు డిమాండ్ చేస్తారని, తన వ్యాపారం దెబ్బ తింటుందని చెబుతాడు. ఈ రేటు ఎవరికీ చెప్పనులే అని సుబ్బారావు వాగ్దానం చేసి వస్తాడు. అక్కడనుండి సుబ్బారావు వచ్చేసి నేను వెంకట్రావ్ వద్ద 7వేలకే చదరపు గజం కొన్నానని చెప్పాడనుకోండి.. అది మిత్ర ద్రోహమే కదా! ఫ్రాన్స్‌తో భారత్ రాఫెల్ ఒప్పందం కూడా అలాంటిదే! మిగతా దేశాలకు అమ్మే ధరకంటే కూడా ఫ్రాన్స్ మనకు తక్కువ ధరకే రాఫెల్ యుద్ధ విమానాలను అమ్మింది. అంతేకాదు, దానికి సంబంధించిన టెక్నాలజీని సైతం బదలాయించడానికి అంగీకరించింది. దీనిద్వారా భవిష్యత్‌లో మనం రాఫెల్ విమానాలను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవడమే కాదు, ఇక్కడ పెట్టే సంబంధిత పరిశ్రమల ద్వారా లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించగలం.

రాఫెల్ ఒప్పందంలో పెద్ద స్కాం వుందంటూ కాంగ్రెసోళ్లు సుప్రీంకోర్టుకు పోయారు. కోర్టుకు పోకుండా వున్నా వచ్చే ఎన్నికల దాకా కూడా మోడీ లక్ష కోట్ల స్కాం చేసాడంటూ వీళ్ళకు అరిచేదానికి అవకాశముండేది. కోర్టుకు పోవడమే వీళ్ల పొరపాటయ్యింది. రాఫెల్ ఒప్పందంలో తమకేమీ అవకతవకలు జరిగినట్లు కనిపించడం లేదని సుప్రీం కోర్టు ఈడ్చి తన్నినట్లు చెప్పడంతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నిద్రపోతున్న గుర్రాన్ని లేపి తన్నించుకున్నట్లయ్యింది. ఈ విషయంలో వీళ్ళంతట వీళ్లే నరేంద్ర మోడీకి క్లీన్ చిట్ ఇప్పించారు.

దేశభక్తి అనే అంశంలో బీజేపీ ఎప్పటికప్పుడు తన ర్యాంకును మెరుగు పరుచుకుంటుంటే, దేశ భద్రతను పణంగా పెడతారనే ప్రచారంలో కాంగ్రెస్ ముందంజ వేస్తూనే వుంది. దేశ రక్షణ, జాతీయ భావాల విషయంలో కాంగ్రెస్ ప్రస్తుత పరిణామాలకు అనుగుణంగా ఎంతో మార్పుకోవాల్సివుంది.


**రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం భారత్-ఫ్రాన్స్‌ల మధ్య కుదిరిన రహస్య ఒప్పందమని, దీనిని బయట పెట్టడం కుదరదని కేంద్రం గతంలో ప్రకటించడం తెలిసిందే! రహస్య ఒప్పందం అంటే అందులో ఏదో మతలబు వుందని, వేలకోట్ల అవినీతి దాగుందని కాంగ్రెస్ అనుమానించింది. వాళ్లకు అలాంటివి అలవాటు కాబట్టి అనుమానాలు రావడం సహజమే! కాని, ఇక్కడ ఫ్రాన్స్‌తో రహస్య ఒప్పందం అన్నది ఒక బిజినెస్ టెక్నిక్!**

## ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం



నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో నెలరోజులపాటు విశేషంగా జరిగే ధనుర్మాస ప్రాతఃకాల దీపారాధన విశిష్ట మహోత్సవాలు ఈనెల 16వతేదీ నుండి వైభవంగా ప్రారంభమయ్యాయి. ధనుర్మాస విశిష్టత పై ఆలయ అర్చక స్వామి శ్రీనివాస్ అయ్యంగార్ తిరుప్పావై పాశుర ప్రవచనం గావించారు. దేవస్థానంలో ఉదయం గోవు విశ్వరూప దర్శనం, తిరువారాధన, తిరుప్పావై సేవాకాలం, నివేదన, సర్వదర్శనం, విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి స్వామి వారి ఊంజల్ సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్ విరుపావరుపుల గిరికృష్ణ, సిబ్బంది పర్యవేక్షించారు

## 24న రమణుని జయంతి వేడుకలు



భగవాన్ శ్రీ రమణ మహర్షి 139వ జయంతి ఉత్సవాలను ఈ నెల 24న నగరంలో ఎంతో వేడుకగా నిర్వహించనున్నారు. స్థానిక 'మహర్షి రమణ రీసెర్చ్ సెంటర్' వారి ఆధ్వర్యంలో, నగరంలోని వేదంవారి అగ్రహారంలో ఉన్న చింతా శ్రీరామమూర్తి కల్యాణవేదిక (ఆంధ్రసభ) ప్రాంగణంలో నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా ఆరోజు ఉదయం 7 నుంచి 11 గంటల దాకా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ రమణ సహస్ర నామార్చాన పూజ నిర్వహిస్తామన్నారు. అనంతరం, సాయంత్రం 6 గంటలకు 'శ్రీ రమణ గోష్టి' కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మహర్షులవారి అనుగ్రహం పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తిచేశారు.

## నందమూరి కుటుంబానికే అవమానం




'నారా వారికి నందమూరి లోకువ' అనే 'లాయర్'లో వచ్చిన వార్తాకథనాన్ని నేను తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత చదివాను. ఎన్నికలకు ముందు 'లాయర్'లో ఏదైతే వ్రాసారో అది అక్షరాలా నిజమైంది. నందమూరి కుటుంబాన్ని అవమానాల పాల్జేయడానికే కూకట్‌పల్లిలో నందమూరి సుహాసినిని నిలబెట్టారు. హరికృష్ణ కుటుంబం మీద చంద్రబాబుకు అంత ప్రేమే వుంటే సుహాసినిని శాసనమండలికో, రాజ్యసభకో పంపించవచ్చు. తన కొడుకునేమో అడ్డదారిలో ఎమ్మెల్సీని చేశాడు. ఆడబిడ్డను రోడ్లో నిలబెట్టాడు. కూకట్‌పల్లి నుండి సుహాసిని బదులు తన కోడలు నారా బ్రాహ్మణిని నిలబెట్టి వుండొచ్చు కదా? అని 'లాయర్' కథనంలో వేసిన ప్రశ్నే ఇప్పుడు నందమూరి అభిమాను లందరిలోనూ మెదులుతోంది. చంద్రబాబు కుట్రలను నందమూరి కుటుంబసభ్యులు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి.

**కూనంపాటి జీవన్‌సాగర్, హైదరాబాద్.**

## హిందువులకు హిందువులే శత్రువులు

ఈ దేశంలో హిందూ సంస్కృతిని ఇతరులు నాశనం చేయడం లేదు. వాళ్ళకు వాళ్ళే నాశనం చేసుకుంటున్నారు. తమ మత సంస్కృతుల వ్యాప్తి కోసం ముస్లింలు, క్రిస్టియన్‌లు ఓటుబ్యాంకులుగా ఏర్పడుతున్నారు. కాని హిందువులు మాత్రం తమ మత సంస్కృతి కంటే కూడా పెట్రోల్ రేట్లు, రేషన్ బియ్యం, పింఛన్‌లు, ఋణమాఫీ వంటి వాటినే చూసుకుంటున్నారు. హిందువుల అనైక్యత వల్లే ఈ దేశాన్ని 600 ఏళ్లు ముస్లింలు, 200 ఏళ్లు తెల్లదొరలు పరిపాలించారు. మనలో మనకు కుళ్ళు కుతంత్రాలు ఉన్నంత వరకు ఇటువంటివి తప్పవు. ఇప్పటికైనా హిందువులు సంఘటితం కాకపోతే, ఇలాగే స్వార్థ ప్రయోజనాల కోసం ఓట్లు వేస్తే మళ్ళీ హిందువులకు బానిస బ్రతుకులు తప్పవు.

**సి.రాజీవి, నెల్లూరు.**

## పిచ్చికి పరాకాష్ట

ముఖ్యమంత్రి చంద్రబాబుకు మతి భ్రమించిందేమో ననిపిస్తోంది. తెలివితేటలు ఎక్కువైతే ఇలాంటి మాటలు వస్తాయేమో? ఆయన పోటీ చేసిన తెలంగాణ ఎన్నికల్లో మాత్రం చిత్తుగా ఓడిపోయాడు. కాని కాంగ్రెస్ పార్టీ గెలిచిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో మాత్రం ఆ పార్టీని నేను గెలిపించానని చెప్పుకుంటున్నాడు చంద్రబాబు. ఆ రాష్ట్రాలలో కనీసం ఒక్క ఎన్నికల ప్రచార సభలోనైనా పాల్గొన్నాడా? బీజేపీని ఈయన చిత్తుచిత్తుగా ఓడించానని చెప్పుకోవడమేంటి? అక్కడ ప్రభుత్వ వ్యతిరేకత వల్ల బీజేపీ ఓడిపోయింది. చంద్రబాబు పరిస్థితి ఎలా తయారైందంటే దేశంలో ఎక్కడ బీజేపీ ఓడిపోయినా అందుకు తానే కారణం అని దండోరా వేసుకునే స్థాయికి దిగజారిపోయాడు.

**సి.హెచ్.భాస్కర్, నాయుడుపేట.**

## నెల్లూరువైపు...
# మాగుంట చూపు

- వైసిపి నుండి ఆహ్వానం
- కాపు కాస్తున్న టిడిపి



రాష్ట్ర రాజకీయాలలో ఒక బ్రాండ్ క్రియేటర్ స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి. 'మాగుంట' అనే ఇంటి పేరును మానవత్వానికి, దాతృత్వానికి బ్రాండ్‌గా మలిచారాయన! మాగుంట సుబ్బ రామరెడ్డి రాజకీయ ప్రవేశం, ముగింపు అంతా కూడా నాలుగేళ్ళలోనే జరిగిపోయింది. ఆయన ఒంగోలు పార్లమెంటు సభ్యులుగా పనిచేసింది నాలుగేళ్ళే అయినా నాలుగు తరాలు గుర్తుపెట్టుకునేంత కీర్తిని, నాలుగు తరాల వారు మరచిపోలేనంత చరిత్రను సృష్టించారు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో, ముఖ్యంగా ప్రకాశం జిల్లా రాజకీయాలలో మాగుంట సుబ్బరామరెడ్డి చెరగని ముద్ర వేశారు. ఆయన మరణానంతరం ఆయన వారసులుగా మాగుంట పార్వతమ్మ, ఆ తర్వాత మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు రాజకీయాలలో కొనసాగుతుండడం చూస్తున్నాం. ఏ ఎంపి కూడా తమ పార్లమెంట్ నియోజకవర్గానికి చేయనంతగా మాగుంట వాళ్ళు ఒంగోలు పార్లమెంట్ ప్రజల బాగు కోసం చేశారు. తమ సొంత డబ్బు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.

### ఓటమి తప్పలేదు...

సాధారణ రాజకీయ వాతావరణంలో అయితే ఒంగోలులో మాగుంటకు ఓటమి వుండదు అనే నమ్మకం వుండేది. అలాంటి నియోజకవర్గంలో కూడా మాగుంట కుటుంబం రెండుసార్లు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 1992లో మాగుంట సుబ్బరామరెడ్డి, 1996లో మాగుంట పార్వతమ్మ ఒంగోలు లోక్‌సభ నుండి విజయం సాధించారు. 1998లో మాగుంట శ్రీనివాసులురెడ్డి రంగప్రవేశం చేశాడు. ఆ ఎన్నికలలో విజయం సాధించిన ఆయన 1999లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా పరాజయం పాలయ్యాడు. మళ్ళీ 2004, 2009లలో ఒంగోలు నుండి గెలిచాడు.

### రాష్ట్ర విభజన మార్పు తెచ్చింది...

రాష్ట్ర విభజన అనంతర పరిస్థితులు కాంగ్రెస్సే ఊపిరి అనుకున్న మాగుంట కుటుంబసభ్యులలోనూ మార్పు తెచ్చాయి. 2014లో మాగుంట శీనయ్య తొలుత వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాలని భావించాడు. అయితే వైసిపి అధినాయకత్వం వారి విషయంలో స్పందించిన తీరు సరిగా లేక తెలుగుదేశంలో చేరి ఆ ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేశాడు. అయితే ప్రకాశం జిల్లాలో వై.యస్. ప్రభావం అధికంగా ఉండడంతో వైసిపి అభ్యర్థి వై.వి.సుబ్బారెడ్డి చేతిలో పరాజయం పొందాడు. ఆ తర్వాత మాగుంట శీనయ్యను ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి అభ్యర్థిగా పోటీకి పెట్టి వైసిపి సభ్యులను కొని గెలిపించి మండలికి పంపించాడు చంద్రబాబు నాయుడు. ఎమ్మెల్సీ అన్నది మాగుంట శీనయ్య స్థాయికి తగిన పదవి కాదు, కాకపోతే మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని చెప్పి చంద్రబాబు మాయమాటలు చెప్పి ఎమ్మెల్సీకి నిలబెట్టాడు. కాని, మాకు ఈ పదవి కావాలి అని నోరు తెరిచి అడిగే తత్వం శీనయ్యకు లేదు. కాబట్టే చంద్రబాబు మంత్రి పదవి మాట చెప్పినా కూడా శీనయ్య ఏ రోజూ దానిని చంద్రబాబుకు గుర్తు చెయ్యలేదు.

### అడుగులు ఎటువైపో...?

ఇంతవరకు సాగిన రాజకీయం ఒకెత్తు, 2019 ఎన్నికలలో మాగుంట శీనయ్య అడుగులు ఎటుపడనున్నాయన్నది మరో ఎత్తు. ఒంగోలు తెలుగుదేశం అభ్యర్థిగా ఆయనను నిలపడానికే చంద్రబాబు కంకణం కట్టుకుని వున్నాడు. ఆయన ఎంపి అభ్యర్థి అయితేనే అసెంబ్లీలో కూడా రసవత్తర పోటీ వుంటుందన్నది చంద్రబాబు ఆలోచన. శీనయ్య ఎక్కడ వైసిపిలోకి వెళతాడోననే ముందుచూపుతోనే గతంలోనే ఒంగోలు సీటును ఆయనకు ఖరారు చేస్తున్నట్లు చంద్రబాబు ఒక సీన్ క్రియేట్ చేశాడు. మరోపక్క వైసిపి అధిష్టానం కూడా గత ఎన్నికలప్పుడు జరిగిన పొరపాటును సరిదిద్దుకోవాలనుకుంటోంది. ఆయన వైసిపిలోకి వస్తే ఆయనకు ఏ సీటు ఇవ్వడానికైనా సిద్ధంగా వున్నట్లు తెలుస్తోంది. ఇంతకాలం ప్రకాశం జిల్లా ప్రజలకు కాంగ్రెస్, తెలుగుదేశం అభ్యర్థిగానే పరిచయమైన శీనయ్య మూడోపార్టీ ద్వారా అక్కడ ప్రజలలోకి వెళ్ళే ధైర్యం చేయలేకపోవచ్చు. అందుకని వైసిపిలో చేరాల్సివస్తే ఆయన నెల్లూరు పార్లమెంటుకే రావచ్చు. ఇదే జరిగితే నెల్లూరు లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల నెత్తిన పాలు పోసినట్లవుతుంది.

## • 'దేశం'లో కలవరం..
# వైసిపి వైపు పయనం!



***తెలంగాణ ఎన్నికల ఫలితాల ప్రభావం ఎక్కువగా ఎవరి మీద ఉండబోతుంది? చంద్రబాబు అనుకూల మీడియా వాళ్ళు తెలంగాణ ఫలితాల తర్వాత విచిత్ర కథనాలు అల్లారు. ప్రధాన పార్టీలను వదిలేసి 'బీజేపీకి షాక్' అంటూ స్టోరీలు ఇచ్చారు. తెలంగాణలో అయినా ఏపిలో అయినా బీజేపీది మూడోస్థానమో, నాలుగోస్థానమో అవుతుంది. వాళ్ళకు ఈ రెండు రాష్ట్రాలలో అధికారం మీద కాదుకదా కనీసం ప్రతిపక్ష స్థానంపై కూడా ఆశలేదు.***

తెలంగాణ ఫలితాల వల్ల తెలంగాణలో కాంగ్రెస్‌కు ఎలాగూ నష్టం జరిగిపోయింది. కాని నష్టం జరగబోయేది మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకే! ఇంతకాలం చంద్రబాబు ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌పై టిడిపి నాయకులు, కేడర్‌కు ఒక నమ్మకముండేది. తెలంగాణ ఎన్నికల దెబ్బకు ఆ నమ్మకం పోయింది.

చంద్రబాబు ఏదైనా చేసి పార్టీని గెలిపిస్తాడనే భ్రమలు తొలగిపోయాయి. గాలి కొట్టిందంటే బాబైనా గల్లంతవ్వాల్సిందనే నిజం గ్రహిస్తున్నారు. అందుకే నిన్న మొన్నటి వరకు తెలుగు దేశంలోనే వుందామనుకున్న వాళ్ళు కూడా ఇప్పుడు వైసిపి వైపు కదులుతున్నారు.

ఇటీవల నెల్లూరుజిల్లాలో వైసిపిలోకి వలసలు జోరందుకుంటున్నాయి. మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దివంగత మాజీసీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిలు వైసిపిలో చేరాక పార్టీలో జోష్ మొదలైంది. ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు సిటి, నెల్లూరురూరల్, గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాలలో వైసిపిలోకి వలసలు జోరందుకున్నాయి. ఇటీవల నగరంలో కీలక నాయకుడిగా వున్న పిండి సురేష్ తన అనుచరులతో వైసిపిలో చేరడం జరిగింది. అంతకుముందు ఆదాల ప్రభాకర్‌రెడ్డి అనుచరులుగా వున్న కొందరు వైసిపిలో చేరడం తెలిసిందే! కాగా, త్వరలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు వై.వి.రామిరెడ్డి, ఎస్.కె.బాషా వంటి వాళ్లు కూడా వైసిపిలో చేరనున్నారు. మరో కీలకమైన నాయకుడు కూడా త్వరలో వైసిపి గూటికి చేరనున్నట్లు సమాచారం. వాతావరణం వైసిపికి అనుకూలంగా మారుతోండడంతో అధికార పార్టీలోకి పోవాలని భావించిన కొందరు నాయకులు ప్రస్తుతానికి వైసిపిలోనే సర్దుకోనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఫలితాల దెబ్బకు బాబుపై నమ్మకం పోయిన కొందరు టిడిపి నాయకులు వైకాపా వైపు చూస్తున్నట్లుగా తెలుస్తోంది.

# పార్టీలో చేరకుండానే... ప్రచారంలో దూకుడు

## అభ్యర్థిత్వం ఖరారుకాకున్నా... అందరితో మంతనాలు!



ఆత్మకూరు తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా మాజీఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య ప్రచారంలో వున్నాడు. 14ఏళ్ల నుండి రాజకీయాలకు దూరంగా వున్న ఆయనను తీసుకొచ్చి తెలుగుదేశం అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నారు. బొల్లినేని కృష్ణయ్య, ఆయన తరపున ఎలక్షన్ బాధ్యతలు చూసే టి.గిరి నాయుడులు ఆత్మకూరు నియోజకవర్గంలో వాళ్ళు, వీళ్లు అని లేకుండా అందరితో మాట్లాడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు మద్దతునివ్వాలని కోరుతున్నారు. కృష్ణయ్యకు వ్యక్తిగతంగా మంచిపేరుంది. కాబట్టి కొందరు నాయకులు సానుకూలంగానే స్పందిస్తున్నారు.

### ఆ పార్టీ మనిషేనా?

అంతా బాగానే వుంది కాని, తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్న బొల్లినేని కృష్ణయ్య అసలు ఆ పార్టీ మనిషేనా? ఆ పార్టీలో ఆయనకు సభ్యత్వముందా? అసలు తెలుగుదేశంలో ఆయనెప్పుడు చేరాడు? ఈ ప్రశ్నలన్నీ తలెత్తుతున్నాయి. వాస్తవంగా చూస్తే ఇంతవరకు బొల్లినేని క్రిష్ణయ్య రాజకీయ ప్రయాణానికి, తెలుగుదేశం పార్టీకి ఎటువంటి సంబంధం లేదు.

1999లో ఆయన కాంగ్రెస్‌పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చాడు. 1999 ఎన్నికల్లో ఆత్మకూరు నుండే కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచాడు. ఐదేళ్ళు కాంగ్రెస్‌లోనే వున్నాడు. 2004లో బీజేపీలోకి వెళ్లాడు. తెలుగుదేశంతో పొత్తులో భాగంగా ఆత్మకూరు నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. 2009లో ఆత్మకూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆనం రామనారాయణరెడ్డి గెలుపుకు సహకరించాడు. అప్పటి నుండి బొల్లినేని వర్గం ఆనం రామనారాయణరెడ్డితోనే కలిసి నడిచింది. 2015లో ఆనం వాళ్ళు తెలుగుదేశంలో చేరినప్పుడు బొల్లినేని వర్గీయులు చేరారేగాని, కృష్ణయ్య వచ్చి నేరుగా చేరలేదు. అధికారికంగా ఇంతవరకు కృష్ణయ్య తెలుగుదేశం పార్టీలో చేరిన సందర్భమే లేదు. మరి పార్టీలో చేరకుండానే ఆయనను అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారంటూ ఆ పార్టీ కార్యకర్తలే ప్రశ్నిస్తున్నారు.







# ఇస్తే పోటీ... లేకుంటే డ్యూటీ!



జిల్లాలో తెలుగుదేశం పార్టీకి ముగ్గురు సిటింగ్ ఎమ్మెల్యేలు, ఒక జంపింగ్ ఎమ్మెల్యే వున్నాడు. ఈ నలుగురు కూడా 2019 ఎన్నికల్లో టిక్కెట్‌ను ఆశిస్తున్నవాళ్ళే! అయితే ఈ నలుగురిలో చూస్తే ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు వద్ద మాత్రం ఒక క్లారిటీ వుంది. ఆయన మళ్ళీ సీటు కోసం ప్రయత్నిస్తున్నాడు. సీటిస్తే మళ్ళీ ఎంత ఖర్చయినా పెట్టుకుంటానంటున్నాడు. ఒక వేళ సీటు ఇవ్వకపోతే మూటాముల్లె సర్దుకుని తన డ్యూటీకి తాను పోతానంటున్నాడు. అంటే కాంట్రాక్ట్ పనులు చేసుకోవడానికి! అయితే బొల్లినేని రామారావుకు ఒక గట్టి నమ్మకముంది. ఉదయగిరి సీటు మళ్ళీ తనకే వస్తుందని. దానికి కారణాలు లేకపోలేదు. ఉదయగిరి సీటులో వుండే వాళ్లెవరూ తనకంటే బలమైన వాళ్ళు కాదనే నమ్మకం. ప్రజాబలంలో ఆయనకంటే మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి ముందుంటాడు. కాని ధన బలంలో వీక్. ఆయన్ను పక్కనపెడితే రేసులో వున్న కావ్య కృష్ణారెడ్డి, అశోక్‌బాబు, బ్రహ్మయ్య వంటివాళ్ళు తన ముందు చాలరనే నమ్మకం బొల్లినేనికి వుంది. అందుకే ఆయనకు సీటు తనకు రాదనే డౌటు లేకుండా వుంది.




# నెల్లూరు కబుర్లు



## నెలాఖర్లో మళ్ళీ రానున్న సిఎం

ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరుకు రానున్నట్లు తెలుస్తోంది. బహుశా 28, లేదా 29 తేదీలలో ఆయన పర్యటన వుండొచ్చు. ఆరోజు 'హౌస్ ఫర్ ఆల్' స్కీం క్రింద నగరంలో పలు చోట్ల నిర్మించిన గృహ సముదాయాలను ఆయన ప్రారంభిస్తారు. అలాగే నెల్లూరు బట్వాడిపాలెం వద్ద ఆధునికంగా నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని కూడా ఆయన ఈసారి పర్యటనలో ప్రారంభించే అవకాశాలున్నాయి.

## ఇది దోపిడీ రాజ్యం

### - వైసిపి ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్



అభివృద్ధి పనుల పేరుతో నెల్లూరులో తెలుగు దేశం నాయకులు కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని నెల్లూరు కార్పొరేషన్ వైసిపి ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ విమర్శించాడు.

17వ తేదీ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని డిప్యూటి మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి నారాయణ, ఆయన భజన బృందం చేస్తున్న అవినీతిని ఆధారాలతో సహా బయటపెడతానన్నారు. దళితవాడల్లో కేటాయించిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల్లో 10 ప్యాకేజీలు పెట్టి దేనికీ ఎస్టిమేషన్ వేయకుండా దోపిడీ చేస్తుండడం దారుణమన్నారు. దళితులకు ఇచ్చే నిధులను కూడా నారాయణ దోచుకోవడం సిగ్గుచేటన్నాడు. మా మంత్రి నారాయణకు అవినీతికి పాల్పడాల్సిన అవసరమేముందని భజనపరులు అంటున్నారు. నారాయణ పాఠశాలలో 10వేలు ఫీజు కట్టలేని విద్యార్థిని బయటే నిలబెట్టిన చరిత్ర వారిది. 10వేల కోసం కూడా కక్కుర్తిపడే వాళ్ళు, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడరంటే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించాడు. ఎస్సీ సబ్‌ప్లాన్ క్రింద ప్రభుత్వం నిర్ణయించిన ధర క్యూబిక్ మీటర్‌కు 6098 రూపాయలు. కాని, సిబ్ ద్వారా మంత్రి నారాయణ ఎన్‌సిసి, ఎల్ అండ్ టి, మెగా కంపెనీలకు ఇచ్చింది 6,438 రూపాయలకు. ఇక్కడే 350 రూపాయల వ్యత్యాసం కనిపిస్తోంది. దీనిద్వారా ఎన్నికోట్ల దోపిడీకి మంత్రి తెరలేపారో అర్థం చేసుకోవచ్చని ఆయన ఆరోపించాడు.

### కర్నూలు పార్లమెంట్

## ఇన్‌ఛార్జ్‌గా రాధాకృష్ణ




కర్నూలు పార్లమెంటుకు బీజేపీ ఇన్‌ఛార్జ్‌గా ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి ముక్కు రాధాకృష్ణను నియమించారు. రాధాకృష్ణ విద్యార్థి దశ నుండి ఏబివిపిలో వుంటూ పలు ఉద్యమాలలో పాల్గొన్నాడు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కూడా పని చేసాడు. ఇటీవలే ఆయనను ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.

## పెరిగిన చలి

దాదాపు 10 నెలల పాటు నెల్లూరు జిల్లా ప్రజలు ఎండలతో అల్లాడారు. ఇప్పుడు చలిగాలులు వణికిస్తున్నాయి. గత వారం రోజులుగా జిల్లాలో చలి పెరిగింది. ధనుర్మాసం కావడంతో ఈ నెలలో చలి సహజంగానే వుంటుంది. కాకపోతే చలి పెరిగితే ఇక వర్షాలు పడవనే భయం వెంటాడుతోంది.

### బొబ్బలకు

## కెన్నల్ క్లబ్ అధ్యక్ష పదవి



నెల్లూరు కెన్నల్ క్లబ్ అధ్యక్షుడిగా కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ ఎన్నికయ్యాడు. ఈ క్లబ్‌కు అధ్యక్షుడిగా వున్న వి.వి.కృష్ణారెడ్డి ఇటీవలే దివంగతులయ్యారు. ఈ నేపథ్యంలో 17వతేదీ నెల్లూరు సంతపేటలోని క్లబ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో క్లబ్ వ్యవస్థాపకులలో ఒకడైన శ్రీనివాసయాదవ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

### కార్పొరేటర్

## వెరైటీ నిరసన

నెల్లూరు 51వ డివిజన్ కార్పొరేటర్ ప్రశాంత్ కుమార్ పబ్లిక్ హెల్త్ అధికారులకు వినూత్న విధానంలో నిరసన తెలిపాడు. కపాడిపాలెంలో భూగర్భ డ్రైనేజీ కోసం సిమెంట్ రోడ్లను తవ్వేసారు. ఆ రోడ్లను సరిచేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రశాంత్‌కుమార్ ఆ సిమెంట్ రోడ్ల డస్ట్ అంతా తెచ్చి బట్వాడిపాలెంలోని పబ్లిక్‌హెల్త్ కార్యాలయం గేటు వద్ద గుట్టగా పోసాడు. వాహనాలు బయటకు పోకుండా లోపలకు రాకుండా చేశాడు. దీంతో పబ్లిక్ హెల్త్ అధికారులు త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పి పంపించారు.

## వైసిపి అగ్రిగోల్డ్ బాధితుల కమిటి

అగ్రిగోల్డ్ బాధితులకు మద్దతుగా నిలిచేందుకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీలను పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేశారు. నెల్లూరు పార్లమెంట్‌కు ఈ కమిటి ఇన్‌ఛార్జ్‌గా వేలూరు మహేష్‌ను, అలాగే తిరుపతి పార్లమెంటుకు కమిటి ఇన్‌ఛార్జ్‌గా వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పేర్నాటి శ్యాంసుందర్‌రెడ్డిని నియమించారు. బాధితులతో కలిసి జరిగే ఉద్యమాలలో వీరు పాల్గొంటారు.

## చేపల మార్కెట్లో తనిఖీలు

నెల్లూరులోని చేపల మార్కెట్లో ఈనెల 16న తూనికలు కొలతల శాఖ అధికారులు, డిప్యూటి కంట్రోలర్ ధామస్ రవికుమార్ నేతృత్వంలో తనిఖీలు చేసారు. అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజ్, ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్ వినియోగదారుల కోసం చేపల మార్కెట్లో ధర్మకాటాను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మార్కెట్‌లోని దుకాణాదారుల కాటాలకు, లీగల్ మెట్రాలజీ తూకాలకు సరిసమానంగా ఉండడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేసారు. నగరమంతా విస్తృతంగా తనిఖీలు చేస్తామన్నారు. వినియోగదారులు అప్రమత్తంగా వుండాలని, ఏదైనా సమస్య వస్తే నెల్లూరు టెక్కెమిట్టలోని కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు.

### కొత్త సంవత్సరం కానుకగా

## నెక్లెస్ రోడ్డు

2019 కొత్త సంవత్సరం కానుకగా నెల్లూరు ప్రజలకు నెక్లెస్‌రోడ్డును అందించాలని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తాపత్రయ పడుతున్నాడు. ఈ విషయమై ఆయన నుడా అధికారులను తొందర చేస్తున్నారు. నెక్లెస్ రోడ్డు పూర్తయితే 'నుడా' ఆధ్వర్యంలో జరిగిన తొలి పెద్ద అభివృద్ధి పని ఇదే అవుతుంది.

## సీఎంఆర్ విజేత సింధు



సీఎంఆర్ చందన వీక్లీ డ్రాలో నెల్లూరు మద్రాసు బస్టాండ్ ప్రాంతానికి చెందిన వి.సింధు హీరో మోటారు బైకును గెలుచుకున్నారు. పండుగలను పురస్కరించుకుని ఈనెల 17న సీఎంఆర్‌లో వీక్లీ డ్రాను టీడీపీ నాయకుడు డా. జడ్.శివప్రసాద్, డా. ప్రసన్న, డా.లలితాశేఖర్‌లు పాల్గొని తీసారు. డైలీ డ్రాలో 5మందికి బహుమతులు అందజేసారు. సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత పెంచలయ్య, శైలేష్, వాసు పాల్గొన్నారు.

## చీఫ్ ప్యాట్రన్‌గా పందిళ్లపల్లి



విశాఖ పట్టణం బీచ్ వాకర్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ గా వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ డిప్యూటి గవర్నర్, ఎంజీఎఫ్ గోల్డ్ డోనర్ పందిళ్లపల్లి పట్టాభి రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం సముద్రతీరంలో పందిళ్లపల్లిని ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ వాకర్స్ ప్రెసిడెంట్ అప్పారావు, కార్యదర్శి శంకర్‌రావు, గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్ రావు, మాజీ అధ్యక్షుడు రమణరావు, కోశాధికారి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌ఫేర్‌లో నేతాజీ విద్యార్థుల సత్తా



కావలిలో ఇటీవల జరిగిన సైన్స్ మ్యాథ్స్ ఎక్స్‌పోలో మ్యాథ్స్ విభాగంలో మేథమేటిక్స్ మోడలింగ్ కాన్సెప్ట్‌కి నెల్లూరులోని శ్రీ నేతాజీ (ఎంఎస్‌ఆర్) పైలట్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారని స్కూల్ కరెస్పాండెంట్ ఎంవి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్‌ఫేర్‌లో సత్తాచాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, శ్రీమతి ఎన్.ప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి డి.వాణి, హెడ్మాస్టర్ ఎస్‌విఎల్ నరసింహా రావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### అయ్యప్ప సన్నిధిలో

## ఆనం చిత్రపటం

నెల్లూరులో దేవాలయాల అభివృద్ధికి, నగర అభివృద్ధికి స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి చేసిన కృషి నెల్లూరీయులు ఎన్నటికి మరచిపోలేరని మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 15న నెల్లూరు వేదాయపాళెంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శ్రీ స్వామి అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడైన స్వర్గీయ ఆనం వివేకానంద రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తమ అన్నయ్య, శ్రీ అయ్యప్ప భక్తుడైన ఆనం వివేకానందరెడ్డి చిత్రపటాన్ని ఆలయంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన నెల్లూరులోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం, శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంతో పాటు అనేక హిందూ దేవాలయాలు, మసీదులు, చర్చీలు, జైన్ మందిరాల అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం చెంచు సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం శుభకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, చాట్ల నరశింహారావు, కొండ్రెడ్డి రంగారెడ్డి, రంగయ్య నాయుడు, స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష కార్యదర్శులు పీటీ రంగరాజన్, జి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### నుడా శీనయ్యకు

## బాలయ్య ఆహ్వానం

సినీహీరో నందమూరి బాలకృష్ణ నటించిన ఎన్టీఆర్ చిత్రం ఆడియో ఫంక్షన్ ఈనెల 21వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న సందర్భంగా నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఈనెల 17న బాలకృష్ణ ఫోన్ చేసారు. ఎన్టీఆర్ చిత్రం ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కు కుటుంబ సమేతంగా రావాలని తనను ఆహ్వానించినట్లు కోటంరెడ్డి తెలిపారు.

### దువ్వూరుకు

## బీజేపీ జిల్లా కార్యదర్శి పగ్గాలు

బీజేపీ జిల్లా కార్యదర్శిగా దువ్వూరు పరుశురాంకు జిల్లా కమిటీలో చోటుదక్కింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి ఈనెల 16న తెలిపారు. బీజేపీ దళిత మోర్చా విభాగంలో అనేక పదవులు చేపట్టిన దువ్వూరు మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి పార్టీ జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించిన పార్టీ జిల్లా అధ్యక్షుడికి, ఇతర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు

### డిప్యూటి రేంజ్ ఆఫీసర్

## రవీంద్రబాబుకు రాష్ట్ర పదవి

జూనియర్ అటవీశాఖ అధికారులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన డిప్యూటి రేంజ్ ఆఫీసర్ పందిళ్ల రవీంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో ఈనెల 16న నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్‌కు ఎన్నికలు జరిగాయి. నెల్లూరు జిల్లా నుంచి రవీంద్రబాబు ఎన్నికవడంపై పలువురు హర్షం ప్రకటించారు.

## సీఎం సాయం...
# రాజకీయాలకు అతీతం

**- మంత్రి పొంగూరు నారాయణ**



పార్టీలకతీతంగా సీఎం సహాయనిధి నుంచి నెల్లూరు జిల్లాలో 350 మందికి రూ.5,09,87,152లను ఇప్పటి వరకు పంపిణీ చేసామని రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఈనెల 16న నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో మంత్రి క్యాంపు కార్యాలయంలో 12 మంది బాధితులకు హెల్త్ రీఎంబర్స్‌మెంట్ కింద రూ. 7.66 లక్షల చెక్కులను పంపిణీ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో వైద్య రంగానికి సంబంధించి చికిత్స పొందిన వారికి సీఎం సహాయనిధి విడుదల చేశామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవా పథకం కింద అర్హులు కాని వారికి వైద్యం కోసం ఈ నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, విజయా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'జనఘోష' వినిపిస్తా!

**- కోటంరెడ్డి**



నెల్లూరు గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 22వ తేదీన గాంధీగిరి తరహాలో 'జనఘోష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నాడు. 17వ తేదీ నెల్లూరులోని వైసిపి రూరల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా నియోజకవర్గ ప్రజలు తాగునీళ్ళ కోసం అలమటిస్తున్నారని, తవ్వేసిన రోడ్లతో అవస్థలు పడుతున్నారని, కొందరు గోతుల్లో పడి ఆసుపత్రుల పాలయ్యారని, సరైన డ్రెయిన్‌లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నిసార్లు అధికారులకు ఈ సమస్యలను చెప్పినా వినే దిక్కు లేకుండా పోయిందని ఆగ్రహంగా చెప్పాడు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం కోసం ఇప్పటికే ఆరుసార్లు ధర్నాలు చేసాను. ఇరిగేషన్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించాను. పాలకులకు, అధికారులకు ఎన్నోసార్లు చెప్పాను. అయినా వారి మనసులు చలించలేదు. సమస్యలను పరిష్కరించలేదు. అందుకే ఈ సమస్యలపై ప్రభుత్వం మెడలు వంచేందుకు 22వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట 'జనఘోష'ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం దిగొచ్చి తాను లేవనెత్తిన సమస్యలకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తే తప్పితే జనఘోషకు ముగింపు ఉండదు. ఈ ఉద్యమం ప్రారంభం తన చేతుల్లో వుందని, ముగింపు మాత్రం తన చేతుల్లో లేదని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో కార్పొరేషన్ చీఫ్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, వైసిపి నాయకులు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, పిండి సురేష్, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, ఏసునాయుడు, లేబూరు పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ఆరోగ్యం గురించి ఆలోచించండి

**- కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేసిన విపిఆర్**



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ నెల 17వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గ్యాంగ్‌వార్‌ను కలిసారు. నెల్లూరుజిల్లా సైదాపురం మండలం కలిచేడు గ్రామంలో పనిచేసే మైకా కార్మికుల కష్టనష్టాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మైనింగ్ సంస్థలలో పనిచేసే కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం కేంద్ర కార్మిక సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పిన 50 పడకల ఆసుపత్రితో పాటు 30 పడకల టి.బి ఆసుపత్రిని కూడా ఇక్కడ మూసేసారు. దీంతో మైకా కార్మికులు ఆరోగ్యపరంగా నానా అవస్థలు పడుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సివుంది. కలిచేడు, తలుపూరు గ్రామాల్లో కేంద్ర కార్మిక సంస్థకు 40ఎకరాల స్థలం వుంది. దీనిని కార్మికుల సంక్షేమం కోసం వినియోగించవచ్చు. సైదాపురం మండలంలో సుమారు 3వేల మంది కార్మికులున్నారు. ఇక్కడ కార్మికుల పిల్లల కొరకు ఏర్పాటు చేసిన స్కూళ్ళలో టీచర్లు లేరని, తాత్కాలిక ప్రాతిపదికనైనా లేదంటే రెగ్యులర్‌గానైనా 16మంది టీచర్లను నియమించి ఆ పిల్లలకు విద్యాసౌకర్యాలు కల్పించాలని వేమిరెడ్డి మంత్రిని కోరారు.

వేమిరెడ్డి చెప్పిన సమస్యలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## బిఎస్ఎన్ఎల్ వైఫై హాట్‌స్పాట్ ప్రారంభించిన ప్రభాకర్‌రెడ్డి...



ఈ నెల 14వ తేదీన నెల్లూరు బట్వాడిపాలెం సెంటర్‌లో బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఫై హాట్‌స్పాట్‌ను రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైఫై హాట్‌స్పాట్‌లను విస్తరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఏ మొబైల్ వినియోగదారులైనా ఈ హాట్‌స్పాట్‌ను ఉపయోగించుకోవచ్చునన్నారు. జిల్లాలో త్వరలో 4జీ సైట్స్ కూడా రాబోతున్నాయని, సామాన్య మానవునికి ఇంటర్నెట్ సేవలను చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎల్ఎల్ జిఎం రవిబాబు, డిజిఎంలు రవీంద్రనాథ్, ప్రసాద్, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య పి.నారాయణరెడ్డి, శంకర్, శ్రీనివాసులురెడ్డి, సునీల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి చొరవతో పీఎం ఆర్ధిక సాయం

వైయస్ఆర్ కడప జిల్లా వేముల మండలం గొల్లలగూడూరుకు చెందిన వీరాంజనేయరెడ్డి వైద్యచికిత్స నిమిత్తం ప్రధానమంత్రి సహాయనిధి నుండి 3లక్షల రూపాయలు మంజూరయ్యాయి. వీరాంజనేయరెడ్డికి తీవ్రమైన వినికిడి సమస్య వుంది. ఆ అబ్బాయి తండ్రి బాలగంగిరెడ్డి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వద్దకు వచ్చి తన బాధను చెప్పుకున్నారు. వెంటనే స్పందించిన విపిఆర్ వీరాంజనేయరెడ్డి సమస్యను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ వ్రాసారు. దీనిపై స్పందించిన పిఎం కార్యాలయం వీరాంజనేయరెడ్డి తక్షణ చికిత్స నిమిత్తం 3లక్షల రూపాయలు మంజూరు చేసింది.

## 'గజ' గజలాడించలేదు.. 'పెథాయ్' ప్రభావం చూపలేదు...
# నీళ్లెట్టా దేవుడా?

ఒకప్పుడు వాయుగుండాలంటే గండాలుగా భావించే వాళ్ళం. తుఫాన్‌లంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకునే వాళ్ళం. తుఫాన్ ముప్పు తప్పిందంటే హమ్మయ్యా అనుకుంటూ ఊపిరి పీల్చుకునేవాళ్ళం. బంగాళాఖాతంలో వాయుగుండం అంటే వారం పాటు వర్షాలు వదిలేవి కావు. తలను బయట పెట్టే పరిస్థితి వుండేది కాదు. నెల్లూరుజిల్లాకు అలాంటి పరిస్థితులు పోయాయి. ఇప్పుడెలాంటి పరిస్థితులొచ్చాయంటే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తుఫాన్‌గా తీవ్రరూపం దాల్చి నెల్లూరుజిల్లాలోనే తీరం దాటాలని భగవంతుడిని కోరుకునే పరిస్థితికొచ్చాం. తుఫాన్‌లు మా జిల్లాలోనే తీరం దాటాలని పూజలు చేసే దుస్థితి కొచ్చాం. ఎందుకంటే జిల్లాలో సాధారణ వర్షాలు పడడం లేదు. ఈశాన్య ఋతుపవనాలు ఈసారి ముఖం చాటేసాయి. ఇక మన జిల్లాలో వర్షాలు కురవడానికి వున్న ఏకైక ఆధారం వాయుగుండాలే! అందుకే ప్రజలకు గండం అని తెలిసినా కూడా వర్షాల కోసం వాయుగుండాలను ఆహ్వానిస్తున్నారు. అయినా అవి నెల్లూరుజిల్లా అంటే పారిపోతున్నాయి.

మొన్న బంగాళాఖాతంలో 'గజ' తుఫాన్ పుట్టింది, ఒంగోలు నెల్లూరుల మధ్య తీరం దాటుతుందనుకున్నది తమిళనాడులోని కడలూరు వద్దకు పారిపోయింది. నిన్న పుట్టిన 'పెథాయ్' తుఫాన్ ప్రభావంతోనన్నా నెల్లూరుజిల్లాలో వర్షాలు పడతాయనుకున్నారు. అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమై సహాయక చర్యలకు భారీ ఏర్పాట్లు చేసుకుంది. తీరా చూస్తే అది ఉత్తరాంధ్ర వైపుకు పరారైంది. అసలే డిసెంబర్ నెలలో వున్నాం. మహా అంటే ఇంకో పదిరోజుల్లో పడితే వర్షాలు పడాలి. లేదంటే ఈ ఏడాదికి ఇంతే వర్షం. ఇక వర్షాలు పడకుంటే నెల్లూరుజిల్లాలో పైర్లు వుండవు. తాగడానికి నీళ్లుండవు. ఎండాకాలంలో రైళ్ళ ద్వారా ఇతర రాష్ట్రాల నుండి నీళ్ళు తెచ్చి పోయాల్సిందే!



# కష్టనష్టాలెన్ని ఎదురైనా.. విద్యాభివృద్ధే ప్రధానంగా ముందుకు సాగారు

స్త్రీ విద్య పట్ల ఎనలేని గౌరవాభిమానాలతో, బాలికలకు చదువు చెప్పి వారి జీవితాల్లో వెలుగులు పరచాలనే సదాశయంతో నాటి స్వాతంత్ర్యపోరాటయోధులు.. సమాజ సేవాపరాయణులు అందరూ కలసి ఈ విద్యాలయం అభ్యున్నతే ధ్యేయంగా అహరహం కృషి చేసేవారు. విద్యాలయం నిర్వహణలో ఎన్నో ఆటంకాలు, అవాంతరాలు ఎదురైనా వెనుకంజవేయక అన్ని రకాల సమస్యలను ఎదుర్కొంటూ..అందరూ ఒక్కటిగా కలసి ఈ విద్యాలయం అభివృద్ధికోసం ముందుకు సాగారు. ఒక్కమాటలో చెప్పాలంటే..కస్తూరిదేవి విద్యాలయం నిర్వహణలో కమిటీది మహోన్నతమైన పాత్ర. ఈ విద్యాలయం పురోగతి కోసం వారు నియమించుకున్న కమిటీ స్పష్టమైన విధివిధానాలను అనుసరిస్తూ..ఎప్పటికప్పుడు తగు నిర్ణయాలు తీసుకుంటూ..ఎన్ని ఇబ్బందులెదురైనా అంతులేని ఆత్మవిశ్వాసంతో.. విద్యాభివృద్ధే ప్రధానంగా వారు ఈ విద్యాలయాన్ని ముందుకు నడిపారు..అనుకున్న లక్ష్యాలను సాధించగలిగారు. అందుకే, నాటి ఆ మహానుభావుల స్ఫూర్తి..నేటి తరానికే కాదు..తరతరాలకు మార్గదర్శకమే!....

**విద్యాలయం నిర్వహణలో కమిటీది మహోన్నతమైన పాత్ర**



**ఇదీ.. ⑦ కస్తూరిదేవి కథ**

## నిబద్ధతకు మారుపేరు.. కస్తూరిదేవి విద్యాలయ కమిటీ

కస్తూరిదేవి విద్యాలయం కమిటీ అంటే నిబద్ధతకు మారుపేరుగా ఉండేది. జిల్లాలో తొలి బాలికా విద్యాలయం ఇదే కనుక, ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ విద్యాలయాన్ని నిర్వహించేవారు. విజ్ఞులు, సమాజ సేవాభిలాషులైనవారు ఈ కమిటీ నిర్వాహకులుగా ఉంటూ విద్యాలయానికి సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని కూడా కూలంకుషంగా చర్చించుకునే వారు. ఉపాధ్యాయుల నియామకాలు కానీ, నిర్మాణాల విషయాల్లో కానీ.. నిర్వహణలో కానీ ఏదైనా సరే..ప్రతి విషయం కూడా చర్చకు రావాల్సిందే తప్ప.. ఎవరంతట వారు ఎలాంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. అప్పట్లో ఎవరైనా కారణాంతరాల వల్ల కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేసినా, కమిటీ చిరకాలం ఈ విద్యాలయాన్ని పరిరక్షించుకోవాలనే ధ్యేయంతో.. వారి స్థానంలో మరొకరిని నియమించుకుంటూ కమిటీ ముందుకు సాగుతుండేది. 1958 ఫిబ్రవరి 5న శ్రీ రామానాయుడుగారు తన సభ్యత్వానికి రాజీనామా చేయగా, ఆ తర్వాత అప్పట్లో విశ్రాంత జిల్లా జడ్జిగా ఉన్న శ్రీయుతులు డి.రంగయ్యగారిని, మరో రిటైర్డ్ డిఎస్పీని సభ్యులుగా కోఆప్ట్ చేసుకున్నారు. 14-4-1960న జరిగిన కమిటీ సమావేశంలో శ్రీ నెల్లూరు శ్రీరామమూర్తిగారిని కమిటీ సభ్యునిగా కోఆప్ట్ చేసుకున్నారు. ఆనాటి కమిటీలో ఆయనతో పాటు, శ్రీయుతులు టి.రామిరెడ్డిగారు, శ్రీ ఎం.దశరధరామిరెడ్డిగారు, ఏ.పద్మనాభరెడ్డిగారు, శ్రీ ఆర్. దశరథరామిరెడ్డిగారు, ఎం.మంజులగారు, ఎం. హేమలతగారు ఉన్నారు. 1961 జూన్‌లో ఆర్.దశరథరామిరెడ్డిగారు తన సభ్యత్వానికి రాజీనామా చేయగా, ఏ.అన్నపూర్ణమ్మగారిని సభ్యురాలిగా కో-ఆప్ట్ చేసుకున్నారు. ఆ తర్వాత వి. సుగుణమ్మగారిని కో-ఆప్ట్ చేసుకున్నారు. వదాన్యులు ఈ విద్యాలయానికి తమవంతు సాయం అందజేస్తుండేవారు. 1961 ఏప్రిల్‌లో వదాన్యులు శ్రీయుతులు ఏసి సుబ్బారెడ్డిగారు 3వేల రూపాయలు, శ్రీమతి టి.అనసూయమ్మగారు 2,500, శ్రీమతి టి.శకుంతలాదేవి 3వేల రూపాయలు ఇలా ఎందరో వదాన్యులు ఈ విద్యాలయానికి విరాళం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

### బాలికల విద్యాభ్యున్నతే లక్ష్యంగా...

## గంటల తరబడి కమిటీ చర్చలు

ఈ విద్యాలయం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న రిక్రియేషన్ హాల్-ఆడిటోరియంకు 16-1-1961న ఠాగూర్ సెంటినరీ సెలబ్రేషన్ కమిటీ వారి సూచన మేరకు 'ఠాగూర్ ఆడిటోరియం'గా నామకరణం చేయాలని నిర్ణయించుకున్నారు. అదేవిధంగా హాస్టల్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు హాస్టల్‌కు ఉత్తరపు ప్రహరీగోడను నిర్మించేందుకు నిర్ణయించారు. విద్యాలయం నిర్వహణకు సంబంధించి పడుతున్న కష్టమంతా ఒక ఎత్తయితే, అప్పట్లో విద్యాలయంలో చదువుకుంటున్న వారి ఉత్తీర్ణత ఆశాజనకంగా లేకపోవడం నిర్వాహకులకు ఎంతో ఆవేదన కలిగించేది. తొలి రోజుల్లో బాలికలు బడికి రావడానికి సంకోచిస్తున్న రోజుల్లో వారినెలాగో బడిబాటలోకి తీసుకువచ్చినా, వచ్చిన ఆ బాలికలు చదువులో వారు ఆశించినస్థాయిలో వృద్ధి చెందకపోతుండడం వారికి బాధ కలిగిస్తుండేది. దీంతో పలు సార్లు కమిటీ సమావేశమై బాలికల విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో గంటలతరబడి చర్చించేది. 22-6-1961లో జరిగిన సమావేశంలో, 1960-61 ఎస్ఎస్ఎల్‌సి పరీక్షల్లో విద్యాలయం బాలికల ఉత్తీర్ణత నిరాశాజనకంగా ఉండడం పట్ల కమిటీ పెద్ద సమీక్షే నిర్వహించింది. ఆ తర్వాత లెవెన్త్, ట్వెల్త్‌ఫారమ్ విద్యార్థినులకు ఇంగ్లీష్ మీడియంను కూడా ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఆనాటి నుంచి విద్యాభివృద్ధికి అవసరమైన ఉపాధ్యాయుల లోటు లేకుండా చూశారు. పాఠశాలలోను, హాస్టల్‌లోను ఎలాంటి కొరతలు లేకుండా చేసి ఎట్లయితేనేం కొంతకాలానికి గణనీయమైన సంఖ్యలో బాలికలు ఉత్తీర్ణులయ్యేలా బోధనను మెరుగుపరచి.. అనుకున్న లక్ష్యాలను సాధించారు. తదుపరి 17-7-1962లో జరిగిన కమిటీ సమావేశంలో రిక్రియేషన్‌హాల్‌కు అవసరమైన సీటింగ్ ఏర్పాట్లకు 10వేల రూపాయలు, ఫ్యాన్లు వగైరాలకు 3వేల వంతున నిధులు మంజూరు చేశారు. హాస్టల్‌లో ఉండే బాలికల సంఖ్య అప్పటికి 50 దాకా పెరగడం నాటి కాలంలో ఎంతైనా విశేషమే. ఈ నేపథ్యంలో వారికి అవసరమైన టేబుల్స్, బెంచీలు వగైరాల ఏర్పాటుకు కూడా 600 రూపాయలను కమిటీ మంజూరుచేసింది. ఇలా అది పెద్దవిషయమైనా.. అతి చిన్న విషయమైనా సరే.. ప్రతి విషయాన్ని కమిటీ చర్చించి అందరి ఆమోదం మేరకే నిధులు మంజూరు చేసేది. ఇదంతా నాటి మహనీయుల చిత్తశుద్ధికి.. సమాజ సేవాభిలాషకు నిదర్శనమని వేరే చెప్పనక్కరలేదు. ఆ తర్వాత రోజుల్లో.. విద్యార్థినులకు నృత్యం లోనూ శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 25-1-1963న జరిగిన కమిటీ సమావేశంలో డ్యాన్సింగ్ కోర్సుకు కూడా అనుమతిస్తూ కమిటీలో తీర్మానం చేశారు. ఆమేరకు మ్యూజిక్ టీచర్‌ను నియమించి, సంగీత వాద్య పరికరాల కోసం 500 రూపాయలు వెచ్చించాలని నిర్ణయించి ఆ మొత్తాన్ని కూడా మంజూరు చేశారు.

కొంతకాలానికి కమిటీలో సభ్యులుగా ఉన్న డి.రంగయ్య గారు దివంగతులు కావడంతో ఆయన స్థానంలో యద్దలపల్లి వెంకటేశ్వర్లుగారిని కమిటీ సభ్యులుగా కోఆప్ట్ చేసుకుంటూ 26-7-1963న జరిగిన కమిటీ సమావేశంలో తీర్మానించారు.

> విద్యాభివృద్ధికి అవసరమైన ఉపాధ్యాయుల లోటు లేకుండా చూశారు. పాఠశాలలోను, హాస్టల్‌లోను ఎలాంటి కొరతలు లేకుండా చేసి ఎట్లయితేనేం కొంత కాలానికి గణనీయమైన సంఖ్యలో బాలికలు ఉత్తీర్ణులయ్యేలా బోధనను మెరుగుపరచి.. అనుకున్న లక్ష్యాలను సాధించారు. ప్రతి విషయాన్ని కమిటీ చర్చించి అందరి ఆమోదం మేరకే నిధులు మంజూరు చేసేది. ఇదంతా నాటి మహనీయుల చిత్త శుద్ధికి.. సమాజ సేవాభిలాషకు నిదర్శనమే మరి!

(మిగతా కథ వచ్చే వారం)



## కనకమ్మగారి మృతితో.. కన్నీరుమున్నీరైన నెల్లూరు

1963... సెప్టెంబర్ 15వ తేదీ... శ్రీ కస్తూరిదేవి విద్యాలయం చరిత్రలోనే కాదు..సింహపురి సీమకే ఆరోజు ఎంతో విషాదకరమైన రోజు. జిల్లాలోనే ఎంతో విశిష్టమైన తొలి బాలికా విద్యాలయానికి నారుపోసి నీరుపోసి పెంచి వృక్షాన్ని చేసి ఫలవంతం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు.. తెలుగునేల గర్వించదగిన నాయకురాలు, కస్తూరిదేవి విద్యాలయం వ్యవస్థాపకురాలు, శ్రీమతి పొణకా కనకమ్మగారు తుది శ్వాస విడిచిన రోజు. చివరి క్షణం వరకు తన గారాల ముద్దుబిడ్డ అయిన కస్తూరిదేవి విద్యాలయం అభ్యున్నతికి అనితరసాధ్యమైన కృషి చేసిన ధీరవనిత కన్నుమూసిన రోజు. ఎలాంటి ఫలితమూ ఆశించని అపారమైన సేవాభావంతో.. జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తలవంచక ధీరత్వంతో తన కలలను సాకారం చేసుకుని, తన కళ్లముందే కళకళలాడుతున్న ఈ సరస్వతీ నిలయాన్ని కళ్లారా చూసుకుని మురిసిపోతున్న ఆమె...అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతితో నెల్లూరు సీమ కన్నీరుమున్నీరైంది. 1892 జూన్ 10న మినగల్లులో జన్మించిన ఆమె జిల్లాలో జమీన్‌దారీరైతు ఉద్యమానికి.. స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరులూదారు. నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం తపిస్తూ.. తన జీవితప్రస్థానంలో ఎన్నెన్నో సమస్యలు, పోరాటాలతో అలసిపోయిన ఆమె.. సుమారు 71 ఏళ్ల వయసులో తనువు చాలించారు. ఎంతో కట్టుబాట్లు కలిగిన గొప్ప జమీందారు కుటుంబంలో జన్మించినా, బాపూజీ బాటలో నడుస్తూ.. అచంచలమైన దేశభక్తితో ఆమె వీధుల్లోకి వచ్చి దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు నడిపి తెలుగుజాతికే ఆదర్శప్రాయమయ్యారు. ఆమె మరణంతో సింహపురిసీమ ఒక పోరాటయోధురాలిని కోల్పోయింది. మహాత్మా గాంధీజీ ఆశీస్సులను అందుకుని జిల్లాలో అటు స్వాతంత్ర్యోద్యమాన్ని, ఇటు బాలికల విద్యకోసం విద్యాలయాన్ని జమిలిగా నడిపిన ఆ వీరనారి మరణంతో నెల్లూరుసీమ మూగబోయింది. మహాత్మాగాంధీజీ అంటే ఆమెకెంతో భక్తి. పల్లిపాడులో గాంధీజీ పేరుతో పినాకిని సత్యాగ్రహాశ్రమాన్ని స్థాపించి జిల్లా పేరును చిరస్థాయి చేశారామె. బాపూజీ నడిపిన సత్యాగ్రహోద్యమం, ఉప్పు సత్యాగ్రహంలలో ఎంతో ధైర్యంగా పాల్గొని జైలు జీవితం కూడా అనుభవించారు. స్వాతంత్ర్యోద్యమంలో జైలు పాలైనా ఏమాత్రం వెరవక, జైలునుంచి బయటకు వచ్చాక తిరిగి కస్తూరిదేవి విద్యాలయం అభివృద్ధికోసం నిరంతరం పోరాడిన అకుంఠిత కార్యదీక్షా దక్షురాలామె. తన జీవితాన్నంతా దేశసేవకు, సమాజసంక్షేమా నికే అంకితం చేశారు. కుటుంబం అప్పులపాలైనా, జీవితం జైలుపాలైనా వెనుకంజవేయక అనుకున్న లక్ష్యసాధనలో నిలిచి గెలిచిన మహానాయకు రాలు..తన సర్వస్వాన్ని స్వాతంత్ర్యోద్యమానికి అర్పించిన త్యాగమూర్తి.. నారీలోకానికే ఆదర్శనారీమణి..మహిళాశిరోమణి..శ్రీమతి పొణకా కనకమ్మగారు. జిల్లాలో అంతటి త్యాగనిరతి-సేవాభావం కలిగిన మహోన్నత నాయకురాలు..ఆమె తర్వాత మనకిక ఎవరున్నారు?...ఒక్క మహిళాలోకానికే కాదు ఆమె జీవితం యావత్ తెలుగు జాతికీ.. భరత జాతికే గర్వకారణం. కనకమ్మగారు కన్నుమూయడంతో విద్యాలయంలోని బాలికలు తల్లిని కోల్పోయిన పిల్లల్లా పెద్దపెట్టున రోదించారు. జిల్లాలోని వారే కాక, రాష్ట్రవ్యాప్తంగా.. దేశంలోని నలుమూలల నుంచి ఎందరో ప్రముఖులు..ఎందరో సమాజ సేవకులు అందరూ ఆ దేశభక్తురాలు ఇక లేరనే బాధతో తల్లడిల్లిపోయారు. 30-9-1963న జరిగిన సమావేశంలో కస్తూరిదేవి విద్యాలయం కమిటీ శోకతప్తహృదయంతో కనకమ్మగారికి కన్నీటి నివాళులర్పించింది. విద్యాలయం వ్యవస్థాపకురాలిగా, శాశ్వత సభ్యురాలిగా అడుగడుగునా ఆమె చేసిన మహనీయమైన సేవలను ప్రస్తుతిస్తూ అశ్రుతర్పణం గావించింది. ఆమె మృతికి తమ ప్రగాఢ సంతాపం వెలిబుచ్చింది. ఈ సంతాప సమావేశంలో నాటి కమిటీ సారధులు టి.రామిరెడ్డిగారు, ఏ.పద్మనాభరెడ్డిగారు, ఎన్.శ్రీరామ మూర్తిగారు, యద్దలపల్లి వెంకటేశ్వర్లుగారు, వై. రామయోగిగారు, సికె శుభప్రదమ్మగారు, శ్రీమతి ఏ. అన్నపూర్ణమ్మగారు, శ్రీ ఆదిశేషారెడ్డిగారు ఉన్నారు. ఏదేమైనా, నేడు ఆ మహనీయురాలు భౌతికంగా లేకపోయినా, ఆ చల్లనితల్లి స్థాపించిన శ్రీ కస్తూరిదేవి విద్యాలయం మాత్రం ఆమె సమాజ సేవానిరతికి నిలువెత్తు నిదర్శనంగా.. ఆమె కలలకు సజీవ సాక్ష్యంగా.. ఆమె పోరాటస్ఫూర్తికి..సాధించిన అద్వితీయమైన ఘనకీర్తికి నిలువుటద్దంగా... నేటికీ కళకళలాడుతూనే ఉంది.

# తెలంగాణ భవన్‌లో చంద్రబాబుకు సన్మానం

గల్పిక

అది హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు రాత్రి పగలు రిక్షా తొక్కి రక్తాన్ని చెమటగా మార్చి వచ్చిన సంపాదనతో కట్టిన హైదరాబాద్ నగరం. జూబ్లీహిల్స్ ప్రాంతం. ఎన్నికల విధ్వంస, తెలంగాణ సీఎం కేసీఆర్ అప్పుడే ఆ ప్రాంతానికి ఆకస్మిక తనిఖీకి వచ్చాడు. ఆ రోడ్డు మీద ఓ వ్యక్తి 'పావురాలగుట్టలో పావురమయ్యాడు... కొడంగల్‌లో నేను కాకినయ్యాను పావురాల గుట్టలో పావురమయ్యాడు...' అని పదేపదే అంటూ అటు ఇటు పిచ్చోడిలా తిరుగుతున్నాడు. కేసీఆర్‌కు అతనినెక్కడో చూసినట్లుగా అనిపించి దగ్గరకెళ్లి చూసాడు. అంతే షాక్ తిన్నాడు. అతను రేవంత్‌రెడ్డి... అతని పక్కనే వున్న వ్యక్తితో... ఏంటి, రేవంత్ ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడని అడిగాడు. దానికతను మొన్న ఫలితాలు వచ్చినప్పటి నుండి ఇలా అయ్యాడు. కొడంగల్‌లో ఓడిపోవడంతోనే ఆయనకు మైండ్ బ్లాక్ అయ్యింది. అప్పటినుండి ఇట్లాగే అరుచకుంటూ కొడంగల్ నుండి హైదరాబాద్ దాకా నడుచుకుంటూ వచ్చాడు అని చెప్పాడు. కేసీఆర్‌కు అతనిపై జాలేసింది. వెంటనే తన సిబ్బందిని పిలిపించి రేవంత్ రెడ్డిని కారులో ఎక్కించి పంపాడు. ఆ తరువాత కేసీఆర్ అలా నడుచుకుంటూ బంజారాహిల్స్ ఏరియాకు వచ్చాడు. అక్కడ ఇంకో వ్యక్తి పొడవాటి గడ్డంతో... "కాశీకి పోయాను రామా హరే... నన్ను ఈవిఎంలే ముంచాయి రామాహరే" అని పాడుకుంటున్నాడు. కేసీఆర్‌కు అతను పరిచయం వున్న వ్యక్తిలాగే అనిపించి దగ్గరకెళ్లి చూసాడు. అతను ఉత్తమ్ కుమార్‌రెడ్డి. ఉత్తమ్, ఉత్తమ్ అని కేసీఆర్ గట్టిగా కేకలేసాడు. అతను ఈ లోకంలోకి రాలేదు సరికదా, అతను ఈవిఎంలే నన్ను ముంచాయి అని కలవరిస్తున్నాడు. ఎలక్షన్ ఫలితాల దెబ్బకు అతనికి కూడా మైండ్ దొబ్బిందని కేసీఆర్‌కు అర్థమైంది. వెంటనే ఆయనను కూడా కారులో ఎక్కించి పంపించాడు.

కేసీఆర్ అక్కడ నుండి ల్యాంకో హిల్స్ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఓ చోట వేల సంఖ్యలో జనం గుమికూడి వున్నారు. వాళ్లందరి చేతుల్లో చీపుర్లు, కర్రలు వున్నాయి. కేసీఆర్ వాళ్లలో ఒకడిని పిలిచి... ఎందుకు మీరంతా చీపుర్లు పట్టుకుని వున్నారు, అసలు ఏమైందని అడిగాడు. అందుకావ్యక్తి... సార్, ఇది ప్రముఖ జ్యోతిష్య పండితుడు లగడపాటి రాజగోపాల్ ఇల్లు. వీళ్లంతా ఆయన బాధితులు... నిన్న ఎన్నికలలో ఆయన సర్వేను నమ్మి ప్రజాఫ్రంట్ గెలుస్తుందంటూ కోట్ల రూపాయల పందేలు పెట్టినవాళ్లు. ఆయన కనపడితే తన్నడానికొచ్చారు అని చెప్పాడు. అందుకు కేసీఆర్... పందేలు కాయడం మీ తప్పు, దానికి అతనిని తన్ని ఏం లాభం అంటూ ఇంతకీ లగడపాటి ఏం చేస్తున్నాడో చూద్దామని లోపలకు వెళ్లాడు. అక్కడ చూస్తే లగడపాటి ఓ చిలకను పెట్టుకుని కొన్ని కార్డులు ముందుపెట్టి... రామ్మా కాజల్ అగర్వాల్... ఒక కార్డుని తీసి వీళ్ల అదృష్టాన్ని చెప్పమ్మా అని తన పాటికి తానే మాట్లాడుకుంటున్నాడు. కేసీఆర్‌కు సీన్ అర్థమైంది. ఫలితాలు చూసాక అతని చిన్నమెదడు చితికిపోయిందని, వెంటనే 108 అంబులెన్స్‌ను పిలిపించి ఆయనను కూడా అక్కడ నుండి షిఫ్ట్ చేయించాడు.

★★★★★

అది టీఆర్ఎస్ పార్టీ కార్యాలయమైన తెలంగాణ భవన్. గెలిచిన ఎమ్మెల్యేలు, ఓడిన అభ్యర్థులు, కార్యకర్తలతో తెలంగాణ భవన్ నిండిపోయింది. వేదికపైన 'టీఆర్ఎస్ విజయసారథికి అభినందన సత్కారం' అని బ్యానర్ తగిలించి వుంది. వేదికపైన అప్పుడే కేసీఆర్, డిప్యూటీ సీఎం మహ్మద్ అలీ, ఎంపీలు కవిత, కేశవరావులు ఆసీనులయ్యారు. కేసీఆర్ మైకు తీసుకుని... ఈరోజు టీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించింది. ఈ విజయంలో మీ అందరి కృషి వుంది. అయితే అసలు ఇంతటి విజయానికి మాత్రం కారణమైన వ్యక్తి ఒక్కడే వున్నాడు. ఆయనను ఈరోజు మనం సత్కరించుకోవడం ధర్మం... అని చెపుతుండగా... కేటీఆర్, హరీష్‌రావులు... ఆ ఒక్క వ్యక్తిని నేనే... ఆ సన్మానం నాకే అని మనసులో అనుకుంటూ ఎవరిపాటికి వాళ్లు మురిసిపోతూ సన్మానం చేయించుకోవడానికి చొక్కా, ఫ్యాంటు సర్దుకున్నారు. ఈ పక్క కేసీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... మన విజయంలో కీలకపాత్ర వహించిన ఆ వ్యక్తిని ఇప్పుడు వేదికపైకి పిలుస్తున్నాను, మీరంతా చప్పట్లు చరచి స్వాగతించాలి. 'ప్రపంచం మెచ్చిన నాయకుడు చంద్రబాబునాయుడు... కమాన్ టు ది డయాస్' అంటూ అరిచాడు. అంతే ఆ మాటకు హాల్ అంతా నిశ్శబ్దం... అందరూ షాక్... సభ మధ్యలో నుండి చంద్రబాబు లేచి నడుచుకుంటూ వెళ్లి వేదిక ఎక్కాడు. ఒక్క నిముషం తర్వాత హరీష్‌రావు, కేటీఆర్‌లు కోలుకున్నారు. హరీష్ వుండి... ఏంటి మామా ఇది, పార్టీ గెలుపు కోసం నేను కష్టపడ్డాను. లేదంటే కేటీఆర్ కష్టపడ్డాడు. మా ఇద్దరినీ వదిలేసి మన పార్టీని ఓడించాలని చూసిన చంద్రబాబును సన్మానిస్తానంటావేమిటి అని అడిగాడు. కేటీఆర్ కూడా లేచి... ఇది అన్యాయం డాడీ అని నిలదీశాడు. అప్పుడు కేసీఆర్ కోపంగా... ఆపండ్రా... అంతకుమించి ఒక్క మాట మాట్లాడినా మీ వీపులు విమానం మోతమోగుతాయ్... మన పార్టీని ఓడించాలని చెప్పి ఆయన పోటీ చేసాడని మీరంటున్నారు, మన పార్టీని గెలిపించడం కోసమే ఆయన పోటీ చేసాడని నేను నమ్ముతున్నాను, ఆయన కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోబట్టే, ఆ పార్టీ వైపున్న వర్గాలు కూడా మన వైపుకొచ్చాయి. హైదరాబాద్‌ను నేనే కట్టాను, హుస్సేన్‌సాగర్‌ను నేనే తవ్వించాను అని ఆయన ప్రచారం చేయబట్టే తెలంగాణ ఫీలింగ్ వున్న ప్రతి ఒక్కరూ మనకు ఓట్లేసారు. ఆయన ఇక్కడ కాలు పెట్టబట్టే వై.యస్.ను అభిమానించే ప్రతిఒక్కరూ మనకు అండగా నిలిచారు. తెలంగాణ కాంగ్రెస్‌తో నాకేం పనిలే అని ఆయన అనుకుని వుంటే మనం గెలవడమే డౌటుగా వుండేది. ఇప్పుడు చెప్పండి ఆయనకు సన్మానం చేయడం రైటా... రాంగా? అని ప్రశ్నించాడు. హరీష్, కేటీఆర్‌లు మౌనంగా తలలు దించుకున్నారు. తర్వాత వేదికపై చంద్రబాబును అందరూ కలిసి ఘనంగా సత్కరించి 'టీఆర్ఎస్ మిత్ర' అవార్డ్‌ను ప్రదానం చేశారు. సభ ముగిసిన తర్వాత అందరూ వెళ్లిపోతున్నారు. కేసీఆర్ కూడా వేదిక దిగి క్రిందకు వచ్చాడు. కేటీఆర్ తన తండ్రి వద్దకు వెళ్లి నిజం చెప్పు నాన్న... చంద్రబాబుకు సన్మానం చేయడానికి ఇంకో కారణమేదో వుంది, అదేంటో చెప్పు అని అడిగాడు. అప్పుడు కేసీఆర్... అటు చూడు అని వేలు ఓ పక్కకు తిప్పాడు. కేటీఆర్ అటువైపు చూసాడు. అక్కడ చూస్తే చంద్రబాబు, ఆయన పక్కన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్, లగడపాటి రాజగోపాల్ వున్నారు. వారిని చూపిస్తూ కేసీఆర్... మొన్నటి ఫలితాల దెబ్బకు ఆ ముగ్గురికి మైండ్ బ్లాకయ్యింది. ఈరోజు ఉదయాన్నే ఆ విషయం నాకు తెలిసింది. వాళ్ల ముగ్గుర్నీ డాక్టర్‌కు చూపించాను. షాక్‌వల్ల అలా అయ్యారని, మళ్లీ అలాంటి షాక్‌తోనే వాళ్లు మామూలు స్థితికి రాగలరని చెప్పాడు. అందుకే ఈరోజు ఈ ప్రోగ్రామ్ పెట్టాను. 'టీఆర్ఎస్ గెలుపులో చంద్రబాబుదే ప్రధానపాత్ర' అనే వార్త వాళ్లకు పెద్ద షాక్ అయ్యింది. దాని వల్లనే వాళ్లు తిరిగి మామూలు స్థితికి వచ్చారు. రాజకీయంగా మనం ఒకర్నొకరు ఎన్నయినా అనుకోవచ్చు... కాని ఆరోగ్యపరంగా ఒకరికొకరు చెడిపోవాలని కోరుకోకూడదు. మానవతా దృక్పథంతో నేను చేసిన ఈ పని తప్పా? అని ప్రశ్నించాడు. అప్పుడు కేటీఆర్ పశ్చాత్తాపంతో... సారీ డాడీ, మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను, ఇప్పటి దాకా మీరు నా దృష్టిలో పొలిటికల్ హీరో... ఇప్పుడు మానవత్వంలోనూ నిజమైన హీరో అనిపించుకున్నారంటూ తండ్రికి సెల్యూట్ చేశాడు.

---

### తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక...

## శ్రీ పొట్టి శ్రీరాములు

### - అమరజీవికి నివాళులర్పించిన నాయకులు

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పోరాటపటిమ ఎంతో స్ఫూర్తిదాయకమని, తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని నాయకులు ప్రశంసించారు. ఈనెల 15వ తేదీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా నగర డిప్యూటీ మేయర్, అర్బన్ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు శ్రీ పొట్టి శ్రీరాములు తన జీవితాన్నే అర్పించారని, అలాంటి త్యాగధనుని ఆశయాల బాటలో అందరం నడవాలని అన్నారు. తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయినా, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని స్మరించుకోవడం తెలుగుజాతి కర్తవ్యమన్నారు. అర్బన్ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కోట సూర్యనారాయణ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకం కావాలన్నారు. కార్యదర్శి వొమ్మిన ఈశ్వర మురళీకృష్ణ, కోశాధికారి అమరా వెంకటేశ్వర్లు, కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఛైర్మన్ దాసా సురేష్‌రాజా, ఆర్యవైశ్య ప్రముఖులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, సరాబు సుబ్రహ్మణ్యం, చలువాది శరణ్ తదితరులు పాల్గొన్నారు.



### పేదలకు అన్నదానం

పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. తొలుత పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజం నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఊరేగించి అమరజీవికి నివాళులర్పించారు. పాండురంగ అన్నదానసమాజం సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



### అమరజీవికి భారతరత్న ప్రకటించాలి - కెవి చలమయ్య

భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకోసం అశువులు బాసిన త్యాగధనుడు, అమరజీవి పొట్టి శ్రీరాములుకు 'భారతరత్న' అవార్డును ప్రకటించాలని అంతర్జాతీయ ఆర్యవైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు, సీనియర్ ఆర్యవైశ్య నాయకుడు కెవి చలమయ్య డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా అమరజీవి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ, శాసనసభ, పార్లమెంట్‌లలో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటాలను ఏర్పాటుచేయాలని, అమరజీవి జయంతి, వర్ధంతుల రోజులను సెలవుదినాలుగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.

---

### పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో...

## 23 నుంచి 'శ్రీమద్రామాయణ సప్తాహం'

పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29వ తేది వరకు శ్రీమద్రామాయణ సప్తాహం నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు తెలిపారు. ఇనమడుగులోని శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థస్వామీజీ ఆశీస్సులతో, నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8గంటల దాకా ఈ కార్యక్రమం ఉంటుందని, తొలిరోజున మందిరం అధ్యక్షులు అమర్తలూరు వేంకటేశ్వర్లుగుప్త, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వారు తెలిపారు. 23న శ్రీ మద్రామాయణం 'బాలకాండ' లోని విషయాలన్నిటినీ విద్వాన్ కోట రాజశేఖర్ వివరిస్తారని, అదేవిధంగా 24న 'అయోధ్య కాండ'ను పోలవరపు లక్ష్మీనరసింహారావు, 25న 'అరణ్యకాండ'ను చదలవాడ లక్ష్మీనరసింహారావు (ఒంగోలు), 26న 'కిష్కింధకాండ'ను విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు, 27న 'సుందరకాండ'ను విద్వాన్ డా. చీమకుర్తి వేంకటేశ్వర్రావు, 28న 'యుద్ధకాండ'ను శతావధాని డా. సూరం శ్రీనివాసులు, 29న 'ఉత్తరాకాండ' లోని విశేషాలను శతావధాని కొండపి మురళీకృష్ణ వివరిస్తారని తెలియజేశారు.


29వ తేదీ రాత్రి 8గంటల నుంచి 'శ్రీరామ పట్టాభిషేకం' అంశంపై విద్వాన్ ఆలూరి శిరోమణిశర్మ ఉపన్యసిస్తారని పేర్కొన్నారు. భక్తులు, సాహిత్యాభిమానులందరూ పాల్గొని శ్రీమద్రామాయణ సప్తాహాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



నెల్లూరు టౌన్‌హాలులో ఇటీవల జరిగిన కవిసమ్మేళనంలో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ నుండి సన్మానం అందుకుంటున్న నెల్లూరు కవి, న్యాయవాది ఇసనాక దయాకర్‌రెడ్డి

# కల్యాణ వైభవం...!

## భరద్వాజ్ - శశిరేఖ






శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గారి ఆప్తమిత్రుడు, డాక్టర్ సాయినాథ్ సోదరుడు, గతంలో హిమాలయా డ్రగ్స్ సంస్థ రెప్రెసెంటేటివ్‌గా, ప్రస్తుతం డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా అందరికీ సుపరిచితుడైన సర్వాభట్ల సుబ్బారావు - గీతల కుమారుడు **భరద్వాజ్ - శశిరేఖ** (హైదరాబాద్ వాస్తవ్యులు పులిపాక రాజేశ్వరరావు - లేట్ వెంకటరామలక్ష్మిల కుమార్తె)ల పెళ్ళి ఈ నెల 12వ తేదీ హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం సకుటుంబ సపరివారంగా హాజరై నవ వధూవరులను ఆశీర్వదించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## నరిష్మ - నీలకాంత్



చెన్నై వాస్తవ్యులు కలికి రంగారెడ్డి - జ్యోతిల కుమార్తె **నరిష్మ - నీలకాంత్** (సూళ్లూరుపేట వాస్తవ్యులు వేలూరు వెంకట్రామారెడ్డి - శ్యామలల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని అనిల్ గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## మనోజ్‌కుమార్ - ఉజ్వల



గూడూరులోని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ శ్రీకంటి రామమోహనరావు సోదరుడు స్వర్గీయ శ్రీకంటి నాగరాజారావు - మాలతిల కుమారుడు **వెంకటసాయి మనోజ్‌కుమార్ - ఉజ్వల** (నెల్లూరు బాలాజీనగర్ వాస్తవ్యులు సురం బాలసుబ్రహ్మణ్యం - చంద్రవతిల కుమార్తె)ల వివాహం ఈ నెల 17వ తేదీ నెల్లూరులోని సుమంగళి కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ఇన్నర్‌వీల్ క్లబ్, మహిళామండలి సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సి.రోహిణి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు

గూడూరు రెండవ పట్టణంలోని సీతమ్మబడి అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల స్థానిక ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళామండలి సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 50వేల రూపాయలు వెచ్చించి అంగన్‌వాడీ కేంద్రంలోని మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వైకాపా సీనియర్ నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి సమాజోపయోగ కార్యక్రమాలు చేపడుతున్న ఆ సంస్థల ప్రతినిధులను, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైకాపా కౌన్సిలర్ నాశిన నాగులుతో పాటు, విష్ణు వందన, స్నేహలతారెడ్డి, లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు హెప్సిబా, జ్యోత్స్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో జాతీయపోటీలకు ఎల్ఏపి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

గూడూరు పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొని విజయం సాధించడం తమకెంతో ఆనందంగా ఉందని ఆ పాఠశాల ఛైర్మెన్ సుబ్రహ్మణ్యంరెడ్డి, వైస్‌ఛైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పోటీలో విజేతలైన విద్యార్థులను వారు అభినందించారు. విజేతలైన విద్యార్థులు వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తా

**- సబ్‌కలెక్టర్ ఆనంద్**



గూడూరు డివిజన్‌లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తానని గూడూరు సబ్‌కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఈ నెల 17న జరిగిన గ్రీవెన్స్‌డేలో ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గానికి సంబంధించిన పలుగ్రామాల సమస్యలను ప్రజలు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన

గూడూరులో ఏపి మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తయిన మహిళలకు ఈనెల 17న సర్టిఫికెట్లు, సబ్సిడీతో మంజూరైన కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. 'పట్టణ దర్శిని-పట్టణ వికాసం'లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కమిషనర్ ఓబులేసుతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**- రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునిగిరీష్**




విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ ఆసక్తి కలిగివుండాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.మునిగిరీష్‌రెడ్డి అన్నారు. గూడూరులోని ఆల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ క్రీడా మైదానంలో రోటరీక్లబ్, గూడూరు క్రికెట్‌క్లబ్, ఆల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్‌క్లబ్, హరిచంద్రారెడ్డి క్రికెట్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల దేహధారుడ్యానికి, మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్లూరు ఆదిశేషారెడ్డి మెమోరియల్ క్లబ్ అధ్యక్షుడు హరిప్రసాద్, రోటరీక్లబ్ కార్యదర్శి రామకృష్ణ స్వరూప్, ప్రతినిధులు మయూరి శ్యాంయాదవ్, రఘురామిరెడ్డి, మునిరాజా, దయాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జేజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్‌ఆర్ట్స్‌లో యువరాజ్ బంగారు, వెండి పతకాలు సాధించాడు



గూడూరు రెండవ పట్టణంలోని శ్రీ వివేకానంద హైస్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న ఎల్.యువరాజ్ ఇటీవల తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం, వెండిపతకం సాధించాడు.

ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ చంద్రమోహన్ యువరాజ్‌ను అభినందించారు. రాష్ట్రంలో తొలిసారి జరిగిన అప్టెడో అకాడా ఇన్విటేషనల్ చాంపియన్‌షిప్-2018లో, కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయిలో తమ స్కూల్ విద్యార్థి రెండు పతకాలు సాధించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు అందరూ యువరాజ్‌ను అభినందించారు.

### సాహితీవేత్త డా. గంగిశెట్టికి

# 'బాలబంధు' పురస్కారం



నెల్లూరీయుడు, బాలసాహితీవేత్త, పరిశోధకుడు డా. గంగిశెట్టి శివ కుమార్ ప్రతిష్ఠాత్మక మైన 'బాలబంధు' పురస్కారాన్ని అందు కున్నారు. ఈనెల 16న గుంటూరు జిల్లా కారంపూడిలో జరిగిన బాలరంజని సేవాసంస్థవారి కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందజేసి ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో బాలరంజని రాష్ట్ర అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దబ్బీరు గోవిందరావు, మాన్‌సింగ్‌నాయక్, మహమ్మద్ రఫీ, విద్యాశాఖ అధికారి వీరయ్యచౌదరి తదితరులు పాల్గొని డా. గంగిశెట్టి బాల సాహిత్యానికి చేస్తున్న సేవలను కొనియాడారు. గత 50 ఏళ్ళుగా డా. గంగిశెట్టి శివకుమార్ చిన్నారుల కోసం కథలు రాస్తున్నారు. పిల్లల కథల మీద పరిశోధన చేసి డాక్టరేట్‌ను కూడా పొందారు. 'చందమామ' పత్రికలో ఉపసంపాదకునిగా ఆయన పనిచేస్తున్నారు. డా. గంగిశెట్టి కథలను ఆంధ్రప్రదేశ్, కర్నాటక ప్రభుత్వాలు చిన్నారులకు పాఠ్యాంశాలుగా కూడా చేర్చడం ఎంతైనా విశేషం. కాగా, డా. గంగిశెట్టి బాలబంధు పురస్కారం అందుకోవడం పట్ల సింహపురిసీమలోని అనేకమంది కవులు, సాహితీవేత్తలు ఆయనకు తమ అభినందనలు తెలియజేశారు.

## అవార్డు సాధించిన సులేఖ



గూడూరులోని ఎస్ఎంజి పాఠశాలలో ప్రధానోపాధ్యాయు రాలిగా విధులు నిర్వహిస్తున్న పి.ఎం సులేఖ ఎంతో ప్రతిష్ఠాత్మక మైన క్రిస్టియన్ మైనార్టీస్ కార్పొరేషన్ వారి అవార్డుకు ఎంపిక య్యారు. ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆమె తన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులందరూ సులేఖను అభినందించారు.

# దళారులను నమ్మొద్దు

### - పోలీసు అభ్యర్థులకు జిల్లా పోలీసుశాఖ సూచన

ఇటీవల పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి దళారుల మాయమాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని జిల్లా పోలీసుశాఖ వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర పోలీసు నియామకబోర్డు ప్రకటన విడుదల చేసిందని, ఈనెల 7వతేదీతో ధరఖాస్తు గడువు ముగిసిందని, ఈ నియామకాల ప్రక్రియ అంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించడం జరుగుతుందని, ప్రాథమిక పరీక్ష, దేహధారుడ్య పరీక్ష, ఆ తర్వాత రాతపరీక్ష ఇలా ఈ ప్రక్రియ మొత్తం సిసిటివిల పరిధిలో జరుగుతుందని, ప్రతిభ ఆధారంగా మాత్రమే నియామకాలు జరుగుతాయని స్పష్టం చేశారు. అయితే అభ్యర్థుల అమాయకత్వాన్ని కొంతమంది ఆసరాగా చేసుకుని వారికి మాయమాటలు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశపెట్టి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంటారని, అలాంటివారి మాటలు నమ్మి మోసపోవద్దని, ఒకవేళ అలాంటివారెవరైనా మీకు తారసపడితే వెంటనే వాట్సాఫ్ 9390777727 నంబరుకు ఫిర్యాదుచేయాలని ఆ ప్రకటనలో అభ్యర్థులకు సూచించారు.

### బెల్ట్‌షాపులకు

# చెక్ పెట్టేదెవరు?

### నామమాత్రపు తనిఖీలతోనే సరిపెట్టేస్తున్నారు

కావలి, దగదర్తి, బోగోలు, అల్లూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇటీవలి కాలంలో మద్యం బెల్ట్‌షాపుల్లో విక్రయాలు జోరుగా జరుగుతున్నా సంబంధిత అధి కారులెవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ ఉన్నతాధికారులు బెల్ట్‌షాపులను అరికట్టే స్తున్నామంటూ ప్రకటనలతో ఆర్భాటం చేస్తున్నారే తప్ప సక్రమంగా తనిఖీలు నిర్వహించడం లేదని, ముఖ్యంగా కావలి రూరల్ ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో బెల్ట్‌షాపులు పెరిగిపోయి మద్యం విక్ర యాలు విపరీతమయ్యాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారించి బెల్ట్‌షాపులను అరికట్టి మద్యం ప్రవాహానికి అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.

### దేవుడు...

# ఇంకా దూరమేనా?

### బోడిగుడిపాడులో నేటికీ...దారుణం!

కావలి నియోజకవర్గం దగదర్తి మండల పరిధిలో ఉన్న బోడిగుడిపాడు గ్రామంలో దళితులకు నేటికీ ఆలయ ప్రవేశం లేకపోవడం పట్ల సర్వత్రా విమ ర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా ఈ గ్రామం లోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాల యంలో నేటికీ దళితులకు ప్రవేశం ఉం డడం లేదని, ఇదెక్కడి విడ్డూరమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక్కడి పార్టీల్లో పెత్తనం చెలాయించే నాయకులు సైతం ఈ విష యంలో నిర్లక్ష్యంగా ఉండడం, దళిత వర్గాలను చిన్నచూపు చూస్తుండడం పట్ల దళితవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

బోడిగుడిపాడు గ్రామం దగదర్తి మండలంలోని మారుమూల గ్రామం. ఇక్కడంతా అటవీప్రాంతం కావడం వల్ల నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్నది ఈ ప్రాంతం. ఉన్నతాధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి ఇక్కడి ప్రజలను చైతన్యవంతం చేసి దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

# పోలీస్‌స్టేషన్‌ల మార్పు

నెల్లూరు నగరంలో కొన్ని పోలీస్‌స్టేషన్‌ల అడ్రస్‌లు మారాయి. నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌ను పోలీస్‌గ్రౌండ్ వద్ద నిర్మించిన కొత్త భవనంలోకి మార్చడం తెలిసిందే! రైల్వేఫీడర్స్ రోడ్డులో వున్న పాత రూరల్ పోలీస్ కార్యాలయాన్ని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిర్మించిన భవనంలోకి దర్గామిట్ట పోలీస్ స్టేషన్‌ను మార్చగా, విఆర్‌సి సెంటర్ వద్ద వున్న ఆ పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని మహిళా పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. ఇక చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌ను ఇప్పటివరకు విఆర్‌సి సెంటర్‌లో మహిళా పోలీస్‌స్టేషన్ వున్న భవనంలోకి మార్చారు. త్వరలో చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌కు 2.75కోట్లతో కొత్త భవనాన్ని కట్టించబోతున్నారు.

### రాజకీయాలకు అతీతంగా...

# రెడ్ల సంక్షేమానికి కృషి చేస్తాం

### - ఏపి రెడ్డి సంక్షేమసంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుమతిరెడ్డి



సిద్ధారెడ్డి జనార్ధనరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమసంఘం ప్రతినిధులు

రెడ్డి సోదరులు ఐక్యంగా ఉంటూ రాజకీయాలకు అతీ తంగా రెడ్ల సంక్షే మానికి కృషిచేయా లని ఏపి రెడ్డి సం క్షేమసంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుమతిరెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు కటాలమ్మ అమ్మవారి ప్రాంగణంలో ఉన్న పరమేశ్వరి కల్యాణ మండపంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం గూడూరు మండల శాఖవారు ఈనెల 16న ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, రెడ్డిసోదరులు కలసికట్టుగా పనిచేసి అభివృద్ధిని సాధించాలని, పేద విద్యార్థుల చదువులకు చేయూతనివ్వాలని, విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు అందరూ ముందుకు రావాలని కోరారు. ప్రముఖ వైద్యులు డా. సి.రోహిణి మాట్లాడుతూ, పేదలు ఎవరైనా వైద్యం కోసం తమ ఆసుపత్రికి వస్తే వారికి తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం 10వ తరగతి చదివి ప్రతిభ కనపరచిన పలువురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 5వేల రూపాయల వంతున ప్రోత్సాహక నగదును అందజేశారు.

ఈ కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమసంఘం గౌరవాధ్యక్షుడు సిద్దారెడ్డి జనార్ధనరెడ్డిని సన్మానించారు. సంఘం ఉపాధ్యక్షుడు బండి వేణుగోపాల్‌రెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, కె.సుందరరామిరెడ్డి, తలమంచి సిద్దారెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పి.సురేష్‌కుమార్‌రెడ్డి, వరదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.జయపాల్‌రెడ్డి, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సిద్ధారెడ్డి జనార్ధనరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమసంఘం ప్రతినిధులు

విశ్రాంత ఉద్యో గుల సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు అంది స్తానని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరులోని పింఛనర్ల భవనంలోని ఫంక్షన్‌హాలులో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు పెన్షనర్లు కావటంతో వారి కష్టాలు తెలుసునన్నారు. దాతల సహకారంతో ఈ భవనాన్ని నిర్మించడం అభినంద నీయమని, తనవంతుగా భవనానికి వచ్చే దినపత్రికల చందాను తానే చెల్లిస్తానన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ సంతోషంగా గడపాలని కోరారు. పట్టణంలో విరివిగా సేవా కార్యక్రమాలు చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి పీఎం రావు, ఏటిఓ చలపతిరాజు, ప్రముఖవైద్యులు డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర డిప్లొమా ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ గోపాలకృష్ణయ్య, స్టేట్‌బ్యాంక్ పట్టణ మేనేజర్ అనిల్‌కుమార్, సంఘం గౌరవాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి భాషా, సహాధ్యక్షులు సుందరరామయ్య, కోశాధికారి భాస్కర్‌రావు, డేవిడ్ జయకుమార్ పాల్గొన్నారు.

# కేసీఆర్ వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన పార్టీని కలుపుకోవాలి. తెలంగాణ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుందామన్న చంద్ర బాబు ప్రతిపాదనను కేసీఆర్ తిరస్కరిం చాడు. చంద్రబాబుతో వాళ్ళు గనుక పొత్తు పెట్టుకుని వుంటే నిన్నటి ఎన్నికల్లో టిఆర్ఎస్ సొంతంగా ప్రజాబలం మీద గెలిచినా, టిఆర్ఎస్‌ను నేనే గెలిపించానని చంద్రబాబు డప్పు వాయించుకుని వుండే వాడు. ఆ ముప్పు నుండి తప్పించుకున్నారు టిఆర్ఎస్ వాళ్ళు.

కేసీఆర్ జాతీయ రాజకీయాలలో వేలు పెట్టాలని చూస్తున్నాడు. చంద్రబాబుకు కూడా జాతీయ రాజకీయాలను ఓ తిప్పు తిప్పాలనే ఆత్రం వుంది. ఒకేరకమైన ఆలో చన చేసే వీరిద్దరికీ ఏ మాత్రం పొత్తు పొసగదు. అందుకే కేసీఆర్ తెలుగుదేశం కంటే కూడా ఏపిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అందుకు మిత్రపక్షంగా భావిస్తు న్నాడు. జగన్‌కు జాతీయ రాజకీయాలతో అవసరం లేదు. అతనికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యం. ఏపికి ప్రత్యేకహోదా రావడం ప్రధానం. ఏపి అభివృద్ధి ముఖ్యలక్ష్యం. కాబట్టి జగన్‌తో కేసీఆర్‌కు సమస్య లేదు. ఏపికి ప్రత్యేకహోదా విషయంలో చంద్ర బాబు కంటే కేసీఆర్ క్లారిటీతో వున్నాడు. ఏపికి ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పివుంటే ఖచ్చితంగా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశాడు. ఏపి నుండి జగన్‌ను కలుపుకుని పోవాలంటే ఏపి అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలకూ కేసీఆర్ మద్దతునివ్వక తప్పదు. కేసీఆర్ కూడా ఆ విధమైన సాను కూల ధోరణినే కనపరుస్తున్నాడు కూడా!

2019 లోక్‌సభ ఎన్నికల్లో వైసిపితో కలుపుకుని తమ మూడు పార్టీలు 30 నుండి 35సీట్లు దాకా సాధిస్తాయని కేసీఆర్ అంచనా! ఈసారి ఎన్డీఏ, బీజేపీయేతర పార్టీల కూటమి మధ్య హోరాహోరీగా పోరు నడిచి ఎవరికీ పూర్తి మెజార్టీ రాని పరిస్థితి ఏర్పడవచ్చు. అప్పుడు తమ ఫెడ రల్ ఫ్రంట్ సీట్లు కీలకంగా మారుతాయని, తెలుగు రాష్ట్రాలలోని పార్టీలకు మళ్ళీ ప్రాధాన్యత లభిస్తుందని కేసీఆర్ అంచనా! అందుకే ఫెడరల్ ఫ్రంట్‌లో వైసిపిని కలుపుకుపోవాలని చూస్తున్నాడు.

వచ్చే ఎన్నికల్లో ఆంధ్రా రాజకీయాల లోనూ ఆయన కలుగజేసుకుంటామని, చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని కేసీఆర్ ప్రకటించాడు. ఆయన చెప్పే రిటర్న్ గిఫ్ట్ వైసిపి గెలుపు, టిడిపి ఓటమే! దాని కోసం ఆయన ఏ విధంగా ప్రయత్నాలు చేస్తాడన్నది సస్పెన్స్!?

# పొత్తుతోనే చిత్తు!

(మొదటి పేజీ తరువాయి)

గాయపరిచింది. ఇప్పుడు రాహుల్‌గాంధీ వచ్చి ఏపికి అది చేస్తాం, ఇది చేస్తామని ఎన్ని గాలి కబుర్లు చెప్పినా ఏపి ప్రజలు మాత్రం కాంగ్రెస్‌ను క్షమించే ప్రశ్నేలేదు. తడిగుడ్డతో గొంతు కోసేసి ఇప్పుడు ఆపరేషన్ చేస్తామంటే తప్పు ఒప్పవుతుందా? కాబట్టి ఆంధ్రాలో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయడమంటే చంద్రబాబు తన నెత్తిన తాను మట్టి చల్లుకోవడమే!

# కస్తూరిదేవిలో అభివృద్ధి మొదలైంది

- కోటిరూపాయలతో మరమ్మతులకు శ్రీకారం
- నేడు విమర్శించిన వారే... రేపు విస్మయం చెందేలా అభివృద్ధి చేయబోతున్న జివికె రెడ్డి
- ఆనందం వ్యక్తం చేస్తున్న సిబ్బంది

***బాలికల విద్య కోసం 90ఏళ్ళ క్రితం ఏర్పడ్డ చారిత్రాత్మక విద్యాసంస్థ శ్రీ కస్తూరిదేవి విద్యాలయాన్ని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసి నెల్లూరు మహిళా లోకానికి కానుకగా అందించాలనే సంకల్పంతో జివికె రెడ్డి సారధ్యంలోని నూతన కమిటి సన్నాహాలు ప్రారంభించింది.***

ఇప్పటికే తరగతులు నిర్వహిస్తున్న పురాతన భవనాలకు దాదాపు 50లక్షల నుండి కోటి రూపాయలతో మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ బాలికల కోసం అధునాతన టాయిలెట్లు, మంచినీటి వసతి కల్పించడంతో పాటు తరగతి గదులన్నీ ఆధునీకరిస్తున్నారు. బీటలు వారిపోయిన భవనాలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి విద్యాలయ ప్రాంగణానికి కొత్త కళను తేనున్నారు. పూర్తిగా శిధిలావస్థకు చేరిన తలుపులు, కిటికీలను తీసేసి కొత్తవాటిని ఏర్పాటు చేయడంతో పాటు అన్ని తరగతి గదులను అధునాతన టైల్స్‌తో ఫ్లోరింగ్‌ను రూపుదిద్దుతున్నారు.



కస్తూరిదేవి ప్రాంగణాన్ని ఎవరో కబ్జా చేసేస్తున్నారంటూ వచ్చిన అబద్ధపు పుకార్లను, స్వార్ధపూరిత వార్తలను పటాపంచలు చేస్తూ అభివృద్ధి అంటే ఏమిటో, పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగితే ఎలా వుం టుందో... చూపించే పనికి జివికె రెడ్డి శ్రీకారం చుట్టారు. ఇక్కడ బాలికల హైస్కూల్‌కు అనుసంధానంగా ఒక మహిళా జూనియర్ కాలేజీని, అలాగే ఎల్‌కెజి నుండి 5వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అతి సామాన్యుడికి అందించే విధంగా ప్రైమరీ స్కూల్‌ను నెలకొల్పే ఆలోచనలో కమిటి ప్రయత్నాలు సాగిస్తోంది.



రానున్న రోజుల్లో కస్తూరిదేవి విద్యాలయం జిల్లా విద్యారంగా నికే తలమానికంగా నిలిచేలా ఈ విద్యాలయాన్ని అభివృద్ధిచేసి నెల్లూరుజిల్లా మహిళా రంగానికి అంకితం చేసే ఆలోచనతో జివికె రెడ్డి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. అభివృద్ధిలో భాగంగా ముందుగా పాత భవనాల మరమ్మతులను చేపట్టి, శరవేగంగా పూర్తిచేస్తున్నారు. నిరాధార నిందలు వేస్తూ, నేడు విమర్శిస్తున్నవాళ్ళే రేపు విస్మయం చెందేలా శ్రీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థలను అభివృద్ధి చేసే పనికి కమిటి సమాయత్తమైంది.



## సిబ్బంది ఆనందం...

ఇన్నాళ్ళకు తమ సంస్థలకు మంచిరోజులు వచ్చాయని అటు బిజిఆర్ ఉమెన్స్ అకాడమీ మరియు కస్తూరిదేవి బాలికా పాఠశాల సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 20మంది టీచర్లు ఉండాల్సిన స్కూల్లో, గత 15ఏళ్ళకు పైగా కేవలం 5మంది ఎయిడెడ్ టీచర్లు మాత్రమే పని చేస్తున్నారని, మిగతా సిబ్బందిని కమిటి దాతల సహాయంతో



నియమించుకుని ఇప్పటివరకు జీతాలు చెల్లిస్తూ వచ్చిందని, వీలైనంత త్వరలో మిగిలిన ఖాళీలను భర్తీచేసి సంస్థ పురోగతికి దోహద పడాలని సిబ్బంది కోరుతున్నారు. పెద్ద మనసుతో కోట్లాదిరూపాయలు వెచ్చించి తమ సంస్థలను అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన జి.వి.కె.రెడ్డి, దొడ్ల శేషారెడ్డి, జె.వి.రెడ్డి, మాగుంట పార్వతమ్మ తదితర కమిటీ సభ్యులను అభినందిస్తూ... తమ పూర్తి సహాయ సహకారాలను వారికి అందిస్తామని సిబ్బంది తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# అభ్యర్థులే ఆధారం

- కేసీఆర్ ఫార్ములాను ఫాలో అవుతున్న చంద్రబాబు

*తెలంగాణ ఫలితాల దెబ్బకు చంద్రబాబుకు దిమ్మతిరిగి మైండ్ బ్లాకయ్యింది. తెలంగాణలో కాంగ్రెస్‌ను కలుపుకుని గెలిచి తానేంటో చూపాలనుకున్నాడు. తామేంటో తెలంగాణ ప్రజలు ఆయనకు చూపించారు. తెలంగాణలో కూటమి గనుక అధికారంలోకి వచ్చుంటే మహాకూటమిని గెలిపించిన మహానాయకుడిగా చంద్రబాబు పేరును మోతెక్కిస్తుండేది పచ్చమీడియా! తెలంగాణలో చెప్పుకునే అవకాశమివ్వకనే చంద్రబాబు ఇప్పుడు మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో బీజేపీ ఓటమికి తామే కారణమని చెప్పుకుంటూ తిరుగుతున్నాడు.*

తెలంగాణలో గెలుపు కోసం కేసీఆర్ ఏ ఫార్ములాను అయితే అనుసరించాడో, చంద్రబాబు కూడా అదే ఫార్ములాను అనుసరిస్తానంటున్నాడు. ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటిస్తానని చంద్రబాబు ప్రకటించాడు. అంటే జనవరిలోనే అభ్యర్థుల జాబితా విడుదల చేస్తాడన్నమాట! కేసీఆర్ కూడా మూడు నెలల ముందే 105మంది అభ్యర్థులను ప్రకటించడం జరిగింది. దీనివల్ల అభ్యర్థులు తమ తమ నియోజకవర్గాలలో లోటుపాట్లను తెలుసుకోగలిగారు. వాటిని సరిచేసుకున్నారు. అసంతృప్తులను బుజ్జగించారు. వర్గ విభేదాలు చల్లబడేలా చేశారు. అన్నింటికి మించి మూడు నెలల సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే తమ తమ నియోజకవర్గాలను చుట్టగలిగారు. మహాకూటమిలోని పార్టీలు సీట్లు సర్దుబాటు చేసుకునే సరికి టిఆర్ఎస్ అభ్యర్థులు ప్రజల్లోకి ముమ్మరంగా వెళ్లిపోయారు.

అయితే టిఆర్ఎస్ విజయంలో అభ్యర్థులే కాదు, కేసీఆర్ ప్రభుత్వానిదీ ప్రధాన భూమిక. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రైతాంగం కోసం చేపట్టిన పనులపై ప్రజలు సానుకూలంగా స్పందించారు. దీనికితోడు చంద్రబాబు తెలంగాణ రాజకీయాలలో తల దూర్చడం కూడా టీఆర్ఎస్‌కు కలిసొచ్చింది. టిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా వుండాల్సిన ఎన్నికల పోరు కాస్తా కేసీఆర్ వర్సెస్ చంద్రబాబు అన్నట్లుగా మారింది. ఇదే కాంగ్రెస్ కొంప ముంచింది.

కాని, ఏపిలో చంద్రబాబు ఎంత ముందుగా అభ్యర్థులను ప్రకటించినా తెలంగాణ వాతావరణం రాదు. అక్కడ ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు. అక్కడక్కడా వ్యతిరేకత వున్నట్లు సీన్లను చంద్రబాబు అనుకూల మీడియానే సృష్టించింది. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అది కాదు. ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వుంది. అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువగా వుంది. రైతాంగ సమస్యలు అలానే వున్నాయి. ఆర్భాటాలకు తప్ప ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు నిధులు లేవు. చంద్రబాబు పాలనపై ప్రజల్లో సానుకూల ధోరణి లేదు. ఈ పరిస్థితులలో చంద్రబాబుకు వున్న పెద్ద ఆధారం అన్ని నియోజకవర్గాలలో బలమైన అభ్యర్థులను దించడం.

2014 ఎన్నికల్లో టిడిపి గెలుపులోనూ ఆ పార్టీ అభ్యర్థులదే ప్రధానపాత్ర! ఆ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులుగా జగన్ కొత్త నాయకులను ఎక్కువగా రంగంలోకి దింపాడు. వారి నియోజకవర్గాలలో వాళ్ళ బలం తక్కువ. 2014లో వైసిపి తరపున 67 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే ఖచ్చితంగా 80శాతం మంది ఎమ్మెల్యేలు జగన్ గాలితో గెలిచిన వాళ్లే! ఓ 20శాతం మంది మాత్రం జగన్ గాలితో పాటు తమ పరపతితో గెలిచివుంటారు. కాని, తెలుగు దేశం నుండి 103మంది ఎమ్మెల్యేలు గెలిస్తే, వారిలో ఖచ్చితంగా 80శాతం మంది తమ నియోజకవర్గాలలో తమకున్న పరపతి పలుకుబడితో గెలిచిన వాళ్ళే! కొంత పార్టీ ఓట్లు వీరికి కలిసుండవచ్చు. కాని, అక్కడ వీళ్ళు గట్టి అభ్యర్థులుగా వుండబట్టే గెలవగలిగారు. అప్పటికీ తెలుగుదేశంలో వున్న సీనియర్ నాయకులతో పాటు కాంగ్రెస్ నుండి వెళ్లిన సీనియర్‌లు, ముదుర్లు కూడా తెలుగుదేశం అభ్యర్థులు కావడంతో, అభ్యర్థుల బలంపై తెలుగుదేశం విజయం సులభమైంది.

ఈసారి కూడా చంద్రబాబు బలం గట్టి అభ్యర్థులే! ఈ ఐదేళ్లలో అధికారం చేతిలో వుంది కాబట్టి వాళ్ళు ఇంకా బలవంతులయ్యారు. వీరిని మూడు నెలలు ముందుగానే అభ్యర్థులుగా ప్రకటిస్తే ఎంతో కొంత పార్టీకే ఉపయోగం. మరి ప్రభుత్వ వ్యతిరేకతను ఈ బలవంతులైన అభ్యర్థులు ఎంతవరకు అధిగమిస్తారో, చంద్రబాబు ఆశలను ఏమేరకు నిలబెడతారో చూడాలి!






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com